Nityam Nigha 07.09.26_Layout 1 07-09-2026 01:59 AM Page 1

RNI. TGTEL/25/A1665

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక



బూర నగేష్ గౌడ్
ఎడిటర్

మండలాలవారీగా
విలేకరులు కావలెను
సీనియర్లకు ప్రాధాన్యత
ఐడి కార్డు, ట్యాగ్, లోగో, వెహికల్ స్టిక్కర్స్ ఇవ్వబడును
ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు
94419 74025
మూసివేయలేని కన్ను - నిత్యం నిఘా

www.nityamnigha.com
RNI. TGTEL/25/A1665
నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక
NITYAM NIGHA TELUGU DAILY
మూసివేయలేని కన్ను - నిత్యం నిఘా
Published From : Warangal
Circulated at : Telangana All Districts



వరంగల్ | సంపుటి 2 | సంచిక 66 | ఎడిటర్ - బూర నగేష్ గౌడ్ | సోమవారం | 07.09.2026 | పేజీలు : 8 | వెల : 4/-

తుక్కుగూడ నర్సు హత్యాచారం

మెజిస్టీరియల్ విచారణకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

- భద్రతా లోపాలు, యాజమాన్య నిర్లక్ష్యంపై పూర్తి స్థాయి విచారణకు సీఎం ఆదేశం
- సాంకేతిక ఆధారాలతో వేగంగా ఛార్జ్‌షీట్ దాఖలు చేయాలని పోలీసులకు స్పష్టం చేసిన సీఎం
- బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరపున ఆర్థిక సాయం, ఇందిరమ్మ ఇల్లు మంజూరు
- ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచన



నిత్యం నిఘా, హైదరాబాద్ : హైదరాబాద్ శివార్లలోని తుక్కుగూడలో గల ఒక ప్రైవేట్ హాస్పిటల్‌లో నర్సు హత్యాచారానికి గురైన ఘటనను ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి తీవ్రంగా పరిగణించి, దీనిపై మెజిస్టీరియల్ విచారణకు ఆదేశించారు. ఘటనకు దారితీసిన పరిస్థితులు, బాధితురాలి వసతి ప్రదేశంలో భద్రతా ఏర్పాట్లు, యాజమాన్య నిర్లక్ష్యం మరియు మహిళా ఉద్యోగుల భద్రతా నిబంధనల అమలు వంటి అంశాలన్నింటినీ పరిశీలించాలని స్పష్టం చేశారు. ఈ కేసులో ఇప్పటికే నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్న నేపథ్యంలో, ఫోరెన్సిక్ మరియు సాంకేతిక ఆధారాలను వేగంగా సేకరించి పకడ్బందీగా సమగ్ర ఛార్జ్‌షీట్ దాఖలు చేయాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబానికి సత్వర న్యాయం చేకూరేలా ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా విచారణ జరిపేందుకు న్యాయ, పోలీసు, ప్రాసిక్యూషన్ విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఇప్పటికే ప్రభుత్వం తరపున మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయంతో పాటు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేశారని, బాధిత కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చిన ముఖ్యమంత్రి, ఇలాంటి ఘటనలకు కారణమయ్యే వ్యవస్థాపరమైన లోపాలను సరిదిద్దాలని అధికారులను ఆదేశించారు.

'దిమాగీ నక్సల్' పిల్ ఇచ్చా..

వాళ్లంతా బయటకొచ్చారు - ప్రధాని మోదీ



- 'దిమాగీ నక్సల్' అనే హోమియోపతి మాత్రతో విమర్శకుల అసలు రంగు బయటపడిందన్న మోదీ
- గత ప్రభుత్వాల హయాంలోని వైఫల్యాలను విద్యార్థులకు వివరించిన ప్రధాని
- 2008 ఆర్థిక సంక్షోభం ఎదుర్కోవడంలో నాటి ప్రభుత్వం విఫలమైందని విమర్శ
- కరోనా, యుద్ధం వంటి సంక్షోభాలను తన ప్రభుత్వం సమర్థంగా ఎదుర్కొందని వెల్లడి
- భారత్ విఫలం కావాలని కోరుకునే వారి ఆశలు నెరవేరడం లేదని వ్యాఖ్య

»2

8 హైకోర్టులకు కొత్త ప్రధాన న్యాయమూర్తులు..

- జాబితా విడుదల చేసిన కేంద్రం



- దేశంలోని 8 హైకోర్టులకు కొత్త ప్రధాన న్యాయమూర్తుల నియామకం
- సుప్రీంకోర్టు కొలీజియం చేసిన సిఫార్సులకు కేంద్రం ఆమోదం
- వివిధ హైకోర్టులలో పనిచేస్తున్న న్యాయమూర్తులకు సీజేలుగా పదోన్నతి
- పాట్నా హైకోర్టు కొత్త సీజేగా జస్టిస్ వల్లూరి కామేశ్వరరావు నియామకం

»2

హైదరాబాద్‌లో 'అహింసా స్థూపం'..

ఆవిష్కరించిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



»2

అసెంబ్లీ సమావేశాల తర్వాత రోడ్డెక్కనున్న కేసీఆర్..

- భారీ ప్రజా ఉద్యమానికి పిలుపు



- కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిరసనగా కేసీఆర్ భారీ ఉద్యమం
- కాళేశ్వరం, పాలమూరు ప్రాజెక్టులపై నిర్లక్ష్యమే ప్రధాన కారణమన్న హరీశ్ రావు
- సీఎం రేవంత్ భాష వల్లే కేసీఆర్ సభకు రావట్లేదన్న వెల్లడి
- అసెంబ్లీ లోపల, బయట సర్కారును నిలదీయాలని బీఆర్ఎస్ నిర్ణయం
- ముందు రేవంత్ రాజీనామా చేయాలని డిమాండ్

నిత్యం నిఘా, హైదరాబాద్ : తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రత్యక్ష పోరాటానికి బీఆర్ఎస్ పార్టీ సిద్ధమైంది. సోమవారం ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాల తర్వాత, కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాలపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నేరుగా భారీ ప్రజా ఉద్యమాన్ని ప్రారంభించనున్నారని పార్టీ ప్రకటించింది. ఆదివారం ఎర్రవల్లిలోని ఫామ్‌హౌస్‌లో కేసీఆర్ అధ్యక్షతన జరిగిన బీఆర్ఎస్ శాసన సభాపక్ష సమావేశంలో ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. సమావేశం అనంతరం వివరాలను అసెంబ్లీలో బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు మీడియాకు వెల్లడించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో నీళ్లు అందుబాటులో ఉన్నప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే నీటిని ఎత్తిపోయకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆయన ఆరోపించారు. తమ ప్రభుత్వం 80 శాతం పూర్తి చేసిన పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు మిగిలిన పనులు పూర్తిచేస్తే 60 టీఎంసీల నీరు అందుబాటులోకి వస్తుందని, కానీ కాంగ్రెస్ సర్కారు కక్షపూరితంగా దాన్ని పక్కనపెట్టిందని విమర్శించారు. "ఈ రెండు ప్రాజెక్టుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిరసనగా, రాబోయే రోజుల్లో స్వయంగా కేసీఆర్ లక్షలాది మందితో ప్రత్యక్ష ప్రజా ఉద్యమానికి నాయకత్వం వహించాలని ఈ సమావేశంలో నిర్ణయించాం" అని హరీశ్ రావు తెలిపారు. అసెంబ్లీలోనూ ప్రభుత్వాన్ని పలు అంశాలపై నిలదీస్తామని హరీశ్ రావు స్పష్టం చేశారు. సెక్షన్ 22ఏ కింద భూములను 'నిషేధిత జాబితా'లో చేర్చి రైతులను వేధించడం, విద్యుత్ కోతలు, రుణమాఫీ వైఫల్యం, పాలి టెక్నిక్ జీవో 97 రద్దు, సింగరేణి కుంభకోణాలు, పీఆర్సీ, డీఏలు, ఈహెచ్ఎస్ అమలులో వైఫల్యాలపై ప్రభుత్వాన్ని గట్టిగా ప్రశ్నిస్తామన్నారు. అసెంబ్లీకి కేసీఆర్ హాజరు కాకపోవడంపై కాంగ్రెస్ చేస్తున్న విమర్శలను హరీశ్ రావు తిప్పికొట్టారు. "ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వాడే విధి స్థాయి భాషను వినడానికి కేసీఆర్ అసెంబ్లీకి రావాల్సిన అవసరం లేదు" అని ఆయన వ్యాఖ్యానించారు. గతంలో ఎన్టీఆర్, జయలలిత, చంద్రబాబు వంటి నేతలు ...

»2

ప్రయివేటీకరణ కథనాల పై క్లారిటీ ఇచ్చిన ఇస్రో



- ప్రైవేటీకరణ వార్తలను ఖండించిన భారత అంతరిక్ష సంస్థ
- మా పాత్ర తగ్గదు, మరింత కీలకమవుతుందని స్పష్టీకరణ
- అధునాతన పరిశోధనలపై దృష్టి పెడతామన్న ఇస్రో
- ప్రైవేట్ రంగ భాగస్వామ్యం సామర్థ్యాన్ని పెంచడానికేనని వెల్లడి
- 2035 నాటికి భారతీయ అంతరిక్ష్ స్టేషన్ ఏర్పాటు లక్ష్యం

»2

2040 వరకు తెలంగాణలో కాంగ్రెస్‌దే అధికారం : మహేశ్ గౌడ్



»2

హైదరాబాద్‌లో ట్రాన్స్‌జెండర్ల ఆగడాలపై డీజీపీ సీవీ ఆనంద్ సీరియస్



- ట్రాన్స్‌జెండర్ల బలవంతపు వసూళ్లపై స్పెషల్ డ్రైవ్‌కు డీజీపీ ఆదేశం
- గతంలోనూ ఇలాంటి దందాలను అరికట్టామని వెల్లడి
- చింతల్‌లో గృహప్రవేశం వద్ద రూ. 50 వేలు డిమాండ్ చేసిన ఘటన వైరల్
- ప్రభుత్వ ప్రోత్సాహంతో పలువురు ట్రాన్స్‌జెండర్లు మంచి పేరు తెచ్చుకున్నారని ప్రశంస
- అన్ని కమిషనరేట్ల పరిధిలో తనిఖీలు చేపట్టాలని పోలీసులకు సూచన

నిత్యం నిఘా, హైదరాబాద్ : కొందరు ట్రాన్స్‌జెండర్లు శుభకార్యాల వద్ద బలవంతంగా డబ్బులు వసూలు చేస్తున్న ఘటనలపై తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ తీవ్రంగా స్పందించారు. ఇలాంటి బెదిరింపులు, దోపిడీలను అరికట్టేందుకు రాష్ట్రవ్యాప్తంగా మరోసారి ప్రత్యేక డ్రైవ్ (స్పెషల్ డ్రైవ్) చేపట్టాలని అన్ని కమిషనరేట్ల సీపీలను ఆదేశించనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఇటీవల హైదరాబాద్‌లోని చింతల్‌లో ఓ గృహప్రవేశ వేడుకలో ట్రాన్స్‌జెండర్లు రూ. 50,000 డిమాండ్ చేసిన ఘటన సోషల్ మీడియాలో వైరల్ అయిన నేపథ్యంలో డీజీపీ ఈ ప్రకటన చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. సెప్టెంబర్ 4న చింతల్ ప్రాంతంలో ఓ కుటుంబం తమ నూతన గృహంలోకి ప్రవేశించేందుకు రాగా, కొందరు ట్రాన్స్‌జెండర్లు వారిని అడ్డుకున్నారు. ఇంట్లోకి వెళ్లాలంటే రూ. 50,000 ఇవ్వాల్సిందేనని పట్టుబట్టారు. అంత మొత్తం ఇచ్చుకోలేమని బాధితులు చెప్పినా వినకుండా అసభ్యంగా ప్రవర్తించి, శాపనార్థాలు పెట్టారని బాధితురాలు వీడియో ద్వారా ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా వ్యాపించడంతో, ఇలాంటి వసూళ్ల దందాలపై కఠిన చర్యలు తీసుకోవాలని నెటిజన్లు పోలీసులను కోరారు...

»2

గణేశ్ ఆగమన్ కార్యక్రమంలో విషాదం

- విద్యార్థి మృతి



»2

Nityam Nigha 07.09.26_Layout 1 07-09-2026 01:59 AM Page 2

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

అసెంబ్లీ సమావేశాల తర్వాత రోడ్డెక్కనున్న కేసీఆర్..

- భారీ ప్రజా ఉద్యమానికి పిలుపు

మొదటిపేజీ తరువాయి.. శాసనసభలో అవమానాలకు గురైనప్పుడు సభను బహిష్కరించి, ప్రజా తీర్పుతో తిరిగి ముఖ్యమంత్రులుగా వచ్చారని, కేసీఆర్ కూడా అదే మార్గంలో పయనిస్తున్నారని అన్నారు. ప్రతిపక్ష నేత భద్రత ఖర్చుపై మాట్లాడే సీఎం రేవంత్ రెడ్డి, కనీసం వార్డు మెంబర్‌గా కూడా లేని తన సోదరుడు తిరుపతి రెడ్డికి నలుగురు గన్‌మెన్లను పెట్టి రూ.40 కోట్లు ఖర్చు చేస్తున్నారని హరీశ్ రావు ఆరోపించారు. 30 లక్షల మంది విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల అంశాన్ని కూడా సభలో ప్రస్తావిస్తామన్నారు. ప్రజా సమస్యలపై సమగ్ర చర్చకు వీలుగా అసెంబ్లీ సమావేశాలను నెల రోజుల పాటు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ రాజీనామా చేయాలన్న కాంగ్రెస్ డిమాండ్‌పై స్పందిస్తూ.. 'ఆరు గ్యారెంటీలు', రుణమాఫీ హామీని నిలబెట్టుకోనందుకు ముందుగా సీఎం రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. పాలన చేతగాక, ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురవుతుండటంతోనే.. కేసీఆర్ రాజీనామా అంశాన్ని తెరపైకి తెచ్చి ప్రజల దృష్టిని మళ్లిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలన పూర్తి చేసుకున్నా.. విద్యార్థులు, నిరుద్యోగులు, రైతులు, మహిళలు, దళిత, గిరిజన, బీసీ వర్గాలను దారుణంగా మోసం చేసిందని విమర్శించారు.

హైదరాబాద్‌లో ట్రాన్స్‌జెండర్ల ఆగడాలపై డీజీపీ సీవీ ఆనంద్ సీరియస్

మొదటిపేజీ తరువాయి.. ఈ ఘటనపై స్పందించిన డీజీపీ సీవీ ఆనంద్, ఇటీవల కాలంలో ఇలాంటి ఫిర్యాదులు తన దృష్టికి వస్తున్నాయని అంగీకరించారు. తాను హైదరాబాద్ సీపీగా ఉన్నప్పుడు కూడా ఇలాంటి బెగ్గింగ్ రాకెట్లు, బలవంతపు వసూళ్లపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టి నియంత్రించినట్లు గుర్తుచేశారు. ఇప్పుడు మళ్లీ అదే తరహా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. అదే సమయంలో, ట్రాన్స్‌జెండర్ల జీవనోపాధికి తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని డీజీపీ ప్రస్తావించారు. ప్రభుత్వ చొరవతో ఎందరో ట్రాన్స్‌జెండర్లు ట్రాఫిక్ అసిస్టెంట్లుగా, ఇతర విభాగాల్లో ఉద్యోగాలు పొంది ఎలాంటి ఫిర్యాదులు లేకుండా మంచి పేరు తెచ్చుకుంటున్నారని ఆయన వివరించారు.

2040 వరకు తెలంగాణలో కాంగ్రెస్‌దే అధికారం : మహేశ్ గౌడ్

మొదటిపేజీ తరువాయి.. తెలంగాణ ప్రజల ఆకాంక్షలైన నీళ్లు, నిధులు, నియామకాల కోసమే తాము పోరాటాలు చేశామని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. కేసీఆర్ రాజీనామా చేయాలంటూ హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన మహాధర్నాలో మాట్లాడిన ఆయన, వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనకు, పదేళ్ల బీఆర్ఎస్ దుర్మార్గానికి మధ్య తేడాపై ఎక్కడైనా బహిరంగ చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని, బీఆర్ఎస్ నాయకులకు ఆ సవాల్‌ను స్వీకరించే ధైర్యం ఉందా? అని నిలదీశారు. గతంలో కేసీఆర్ చేసిన కొండంత అప్పులను మోస్తూనే తమ ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా నిరుపేదలకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని గుర్తుచేశారు. కేటీఆర్ కేవలం సోషల్ మీడియాకే పరిమితమై క్షణికానందం పొందుతున్నారని, ఆయన చదువుకున్నప్పటికీ సంస్కారం లేని రీతిలో ప్రవర్తిస్తున్నారని మహేశ్ గౌడ్ దుయ్యబట్టారు. తెలంగాణ సంస్కృతిని కాపాడుతూ గద్దర్, అందెశ్రీ, పూలే, సర్దార్ సర్వాయి పాపన్న వంటి మహనీయులను గౌరవించిన ఘనత కాంగ్రెస్‌దేనని తెలిపారు. కేసీఆర్ తన కొడుకు, అల్లుడి రాజకీయ ప్రయోజనాల కోసం ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారని, అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై మాట్లాడటంలో ఘోరంగా విఫలమయ్యారని విమర్శించారు. కేసీఆర్ చేత కాకపోతే రాజీనామా చేసి తప్పుకోవాలని హితవు పలికారు. రాష్ట్రాన్ని దశాబ్దాల పాటు ఏలే శక్తి కాంగ్రెస్‌కు ఉందని, తెలంగాణలో 2040 వరకు తమ ప్రభుత్వమే అధికారంలో ఉంటుందని తేల్చిచెప్పారు. తెలంగాణ మట్టిలో బీఆర్ఎస్ అనే మొక్క ఇప్పటికే వాడిపోయిందని, బీజేపీ అనే మొక్క

గణేశ్ ఆగమన్ కార్యక్రమంలో విషాదం

- విద్యార్థి మృతి

మొదటిపేజీ తరువాయి.. హైదరాబాద్‌లో గణేశ్ నవరాత్రులు ప్రారంభం కాకముందే విషాదం చోటుచేసుకుంది. ముషీరాబాద్‌లోని రాంనగర్ చౌరస్తాలో నిర్వహించిన 'గణేశ్ ఆగమన్' కార్యక్రమంలో జరిగిన తొక్కిసలాటలో బద్రీనాథ్ (19) అనే ఇంజినీరింగ్ విద్యార్థి ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటనతో స్థానికంగా తీవ్ర విషాద ఛాయలు అలముకున్నాయి. ముషీరాబాద్‌లోని రాంనగర్ చౌరస్తాలో 'శ్రీ గణపతి యూత్ అసోసియేషన్' ఆధ్వర్యంలో వినాయక ఆగమన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు భారీ సంఖ్యలో భక్తులు, యువకులు తరలివచ్చారు. అయితే, ఒక్కసారిగా జనం గుమిగూడటంతో తీవ్ర తొక్కిసలాట చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బద్రీనాథ్ అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. బద్రీనాథ్ స్వస్థలం ఆంధ్ర ప్రదేశ్‌లోని కడప జిల్లా. ఆయన ప్రస్తుతం హైదరాబాద్ రాంనగర్‌లోని గౌరీశంకర్ అపార్ట్‌మెంట్‌లో నివసిస్తూ, అబిడ్స్‌లోని మెథొడిస్ట్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో బీటెక్ చదువుతున్నాడు. సమాచారం అందుకున్న ముషీరాబాద్ పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టినట్లు వెల్లడించారు.

'దిమాగీ నక్సల్' పిల్ ఇచ్చా..

వాళ్లంతా బయటకొచ్చారు - ప్రధాని మోదీ

మొదటిపేజీ తరువాయి.. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విపక్ష నేతలపై మరోసారి తనదైన శైలిలో విరుచుకుపడ్డారు. తాను గతంలో ప్రయోగించిన 'దిమాగీ నక్సల్' పదాన్ని పునరుద్ఘాటిస్తూ, అది ఒక హోమియోపతి మాత్రలా పనిచేసి విమర్శకుల అసలు స్వరూపాన్ని బయటపెట్టిందని వ్యాఖ్యానించారు. నిన్న ఢిల్లీలోని శ్రీరామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్ (ఎస్ఆర్‌సీసీ) శతాబ్ది ఉత్సవాల్లో ప్రధాని ప్రసంగించారు. ఈ సందర్భంగా యువతను ఉద్దేశించి మాట్లాడుతూ, తన ప్రభుత్వ పాలనను, గత ప్రభుత్వాల పనితీరును పోల్చి చూపిస్తూ పదునైన విమర్శలు చేశారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. "ఎర్రకోట నుంచి నేను చేసిన ప్రసంగం మీరు విని ఉండొచ్చు. నేను ఎర్రకోట నుంచి 'దిమాగీ నక్సల్' అనే ఒక హోమియోపతి పిల్ ఇచ్చాను. హోమియోపతి సూత్రాల ప్రకారం, చికిత్స ప్రారంభించినప్పుడు మొదట్లో వ్యాధి మరింత తీవ్రమవుతుంది. అదే హోమియోపతి స్వభావం" అని వివరించారు. "అదేవిధంగా, నేను 'దిమాగీ నక్సల్' పిల్ ఇవ్వగానే, దిమాగీ నక్సల్స్ ఒక్కొక్కరుగా బయటకు రావడం మొదలుపెట్టారు. ఈ వ్యాధిని ప్రోత్సహిస్తున్న వారి అసలు రంగును ఇప్పుడు ప్రజలు కూడా చూస్తున్నారు" అని అన్నారు. గతంలో దేశం ఎదుర్కొన్న సంక్షోభాలను నాటి ప్రభుత్వాలు ఎదుర్కొన్న తీరును ప్రధాని తీవ్రంగా విమర్శించారు. "నేను మీకు చాలా విషయాలు చెప్పాను. 'ఇదేంటి? ఇది 140 కోట్ల మంది ప్రజలున్న దేశం. ఇది చాలా సులభం. మోదీ కొత్తగా ఏం చేశారు?' అని కొందరు అనుకోవచ్చు. కానీ అది నిజంగా అంత సులభమా? నేను మిమ్మల్ని మరోసారి పాత రోజుల్లోకి తీసుకెళ్లాలనుకుంటున్నాను" అని విద్యార్థులను ఉద్దేశించి అన్నారు. 2013 నాటి కేదార్‌నాథ్ విపత్తును ప్రస్తావిస్తూ.. "అప్పుడు యావత్ ప్రభుత్వం కకావికలమైంది. ఏం చేయాలో, ఎలా స్పందించాలో వారికి తెలియలేదు" అని గుర్తుచేశారు. అదేవిధంగా 2008లో వచ్చిన ప్రపంచ ఆర్థిక సంక్షోభాన్ని కూడా అప్పటి ప్రభుత్వం సమర్థంగా ఎదుర్కోలేకపోయిందని విమర్శించారు. "2008లో బ్యాంకింగ్ సంక్షోభం వచ్చినప్పుడు, నాటి ప్రభుత్వం ఏళ్ల తరబడి ఆ సంక్షోభం చాటున దాక్కునే ప్రయత్నం చేసింది. దాన్ని ఎదుర్కొనే ధైర్యం కూడా వారికి లేదు. భారతదేశ మొత్తం బ్యాంకింగ్ వ్యవస్థ పతనం అంచుకు నెట్టబడింది" అని ఆయన పేర్కొన్నారు. తన ప్రభుత్వం ఎదుర్కొన్న సవాళ్లను వివరిస్తూ, వాటిని ఎలా ధైర్యంగా ఎదుర్కొన్నారో మోదీ వివరించారు. "మొదట ప్రపంచాన్ని స్తంభింపజేసిన కోవిడ్-19 మహమ్మారి వచ్చింది. ఆ తర్వాత రష్యా-ఉక్రెయిన్ మధ్య యుద్ధం మొదలైంది. వాణిజ్యం, సరఫరా గొలుసులు ఆయుధాలుగా మారాయి. పశ్చిమాసియాలో సంక్షోభం తలెత్తింది. ప్రతీసారి 'ఇక భారత్ నిలబడదు' అని అన్నారు. నన్ను నా అతిపెద్ద ఆరాధకులు (విమర్శకులు) అయితే 'ఇప్పుడు మోదీ చిక్కుకున్నాడు, పడిపోయాడు, ఇక అతన్ని అణిచివేస్తారు' అని సంతోషించారు. కానీ, నా దేశ ప్రజల ఆశీర్వాదాలకు ఎంత శక్తి ఉందంటే, భారత్ విఫలం కావాలని కోరుకునే వారి ప్రతి కోరిక నెరవేరడం లేదు" అని మోదీ వ్యాఖ్యానించారు. 2013లో గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కూడా మోదీ ఎస్ఆర్‌సీసీని సందర్శించారు. అప్పుడు విద్యార్థులను ఉద్దేశించి ఆయన చేసిన ప్రసంగం 2014 లోక్‌సభ ఎన్నికలకు ముందు సోషల్ మీడియాలో బాగా ప్రాచుర్యం పొందింది. ఇప్పుడు ప్రధాని హోదాలో అదే వేదికపై నుంచి ప్రసంగించడం గమనార్హం.

8 హైకోర్టులకు కొత్త ప్రధాన న్యాయమూర్తులు..

- జాబితా విడుదల చేసిన కేంద్రం

మొదటిపేజీ తరువాయి.. దేశంలోని న్యాయవ్యవస్థలో కీలక నియామకాలు జరిగాయి. సుప్రీంకోర్టు కొలీజియం చేసిన సిఫార్సుల మేరకు ఎనిమిది హైకోర్టులకు కొత్త ప్రధాన న్యాయమూర్తులను (సీజే) నియమిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నియామకాల వివరాలను కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. కొలీజియం సిఫార్సు చేసిన కొద్ది రోజులకే కేంద్రం వేగంగా స్పందించి ఈ నియామక ప్రక్రియను పూర్తి చేయడం గమనార్హం. నియామకాల వివరాల్లోకి వెళితే.. ఢిల్లీ హైకోర్టులో న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ వల్మూరి కామేశ్వర రావును పాట్నా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమించారు. అదేవిధంగా బాంబే హైకోర్టుకు చెందిన జస్టిస్ రవీంద్ర వి. ఘుగే కలకత్తా హైకోర్టుకు నేతృత్వం వహించనున్నారు. ఛత్తీస్‌గఢ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ కుమార్ అగర్వాల్‌ను రాజస్థాన్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమించారు. అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మహేష్ చంద్ర త్రిపాఠి బాంబే హైకోర్టు కొత్త సీజేగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ నియామకాల నేపథ్యంలో రాజస్థాన్ హైకోర్టు వ్యవహారం ప్రాధాన్యం సంతరించుకుంది. అక్కడి తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ప్రకాశ్ శర్మపై సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సందీప్ మెహతా అసాధారణ రీతిలో తీవ్ర ఆరోపణలు చేయడంతో పెద్ద వివాదం చెలరేగింది. ఈ పరిణామాల తర్వాత ఇప్పుడు అక్కడ పూర్తిస్థాయి ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సంజయ్ కుమార్ అగర్వాల్‌ను నియమించారు. మిగతా నియామకాలలో పంజాబ్, హర్యానా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అశ్వనీ కుమార్ మిశ్రాను అదే కోర్టుకు ప్రధాన న్యాయమూర్తిగా నియమించారు. ఒడిశా హైకోర్టుకు చెందిన జస్టిస్ కృష్ణ రామ్ మహాపాత్ర ఛత్తీస్‌గఢ్ హైకోర్టు సీజేగా, గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అల్పేష్ యశ్వంత్ కోగ్జే మధ్యప్రదేశ్ హైకోర్టు సీజేగా నియమితులయ్యారు. రాజస్థాన్ హైకోర్టులో న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ పుష్పేంద్ర సింగ్ భాటిని జమ్మూ & కాశ్మీర్, లడఖ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమిస్తూ కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నియామకాలతో పలు హైకోర్టులలో న్యాయపాలన మరింత పటిష్ఠం కానుంది.

ప్రయివేటీకరణ కథనాల పై క్లారిటీ ఇచ్చిన ఇస్రో

మొదటిపేజీ తరువాయి.. భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో)ను ప్రైవేటీకరిస్తున్నారంటూ గత కొద్ది రోజులుగా మీడియాలో వస్తున్న ఊహాగానాలకు సంస్థ ఆదివారం పూర్తి స్థాయిలో తెరదించింది. ఇస్రోను ప్రైవేటీకరించే ఆలోచన లేదని, దేశ అంతరిక్ష ప్రయోగాలలో దాని ప్రాధాన్యం ఎప్పటికీ తగ్గదని స్పష్టం చేసింది. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా ఒక సుదీర్ఘ ప్రకటన విడుదల చేసింది. ఇస్రో భవిష్యత్ పాత్రపై కొన్ని మీడియా సంస్థలు అసత్యాలు, తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తున్నాయని, ఈ కథనాలు పూర్తిగా నిరాధారమైనవని ఇస్రో పేర్కొంది. "ఇస్రోను ప్రైవేటీకరించరు, దాని ప్రాముఖ్యాన్ని తగ్గించరు. అత్యాధునిక అంతరిక్ష పరిశోధనలు, సాంకేతిక అభివృద్ధి, వ్యూహాత్మక ప్రయోగాలు, అంతరిక్ష విజ్ఞానం, అన్వేషణ వంటి కీలక రంగాలలో ఇస్రో దేశానికి ప్రధాన సంస్థగా కొనసాగుతుంది" అని ఆ ప్రకటనలో తేల్చిచెప్పింది. అంతరిక్ష రంగంలో ప్రైవేట్ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం వెనుక ఉద్దేశం ఇస్రో పాత్రను తగ్గించడం కాదని, మరింత ఉన్నతమైన లక్ష్యాలపై దృష్టి సారించేలా చేయడమేనని వివరించింది. 2020లో ప్రారంభమైన సంస్కరణలు, 2023 భారత అంతరిక్ష విధానం ద్వారా దేశంలో బలమైన, ప్రపంచంతో పోటీపడగల అంతరిక్ష పర్యావరణ వ్యవస్థను నిర్మించడమే లక్ష్యమని తెలిపింది. దీనివల్ల ఇస్రో ప్రాధాన్యం తగ్గదని, భారత అంతరిక్ష పర్యావరణ వ్యవస్థ స్వరూపం, సామర్థ్యం విస్తరిస్తాయని పేర్కొంది. సాంకేతికంగా అభివృద్ధి చెందిన, పునరావృతమయ్యే పనులను పరిశ్రమలకు అప్పగించడం ద్వారా ఇస్రో శాస్త్రవేత్తలు, సిబ్బంది తమ సమయాన్ని అధునాతన పరిశోధనలు (ఆర్ అండ్ డీ), కొత్త తరం టెక్నాలజీలు, సంక్లిష్టమైన జాతీయ ప్రాజెక్టులపై కేంద్రీకరించగలరని ఇస్రో తెలిపింది. ఇది "ఇస్రో నేతృత్వంలోని జాతీయ అంతరిక్ష పర్యావరణ వ్యవస్థ"కు నాంది పలుకుతుందని వివరించింది.

హైదరాబాద్‌లో 'అహింసా స్థూపం'..

ఆవిష్కరించిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

మొదటిపేజీ తరువాయి.. హైదరాబాద్‌లో గణేశ్ నవరాత్రులు ప్రారంభం కాకముందే విషాదం చోటుచేసుకుంది. ముషీరాబాద్ లోని రాంనగర్ చౌరస్తాలో నిర్వహించిన 'గణేశ్ ఆగమన్' కార్యక్రమంలో జరిగిన తొక్కిసలాటలో బద్రీనాథ్ (19) అనే ఇంజినీరింగ్ విద్యార్థి ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటనతో స్థానికంగా తీవ్ర విషాద ఛాయలు అలముకున్నాయి. ముషీరాబాద్ లోని రాంనగర్ చౌరస్తాలో 'శ్రీ గణపతి యూత్ అసోసియేషన్' ఆధ్వర్యంలో వినాయక ఆగమన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు భారీ సంఖ్యలో భక్తులు, యువకులు తరలివచ్చారు. అయితే, ఒక్కసారిగా జనం గుమిగూడటంతో తీవ్ర తొక్కిసలాట చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బద్రీనాథ్ అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. బద్రీనాథ్ స్వస్థలం ఆంధ్ర ప్రదేశ్‌లోని కడప జిల్లా. ఆయన ప్రస్తుతం హైదరాబాద్ రాంనగర్‌లోని గౌరీశంకర్ అపార్ట్‌మెంట్‌లో నివసిస్తూ, అబిడ్స్‌లోని మెథొడిస్ట్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో బీటెక్ చదువుతున్నాడు. సమాచారం అందుకున్న ముషీరాబాద్ పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టినట్లు వెల్లడించారు.



Nityam Nigha 07.09.26_Layout 1 07-09-2026 01:59 AM Page 3

పలివేల్పుల వద్ద తప్పిన భారీ ప్రమాదం

- ఇటుకల లోడుతో బోల్తాపడిన లారీ.. తప్పిన ప్రాణనష్టం



హనుమకొండ, సెప్టెంబర్ 06 (నిత్యం నిఘా ప్రతినిధి) : హనుమకొండ–కరీంనగర్ ప్రధాన రహదారిపై ఆదివారం తెల్లవారుజామున భారీ ప్రమాదం తప్పింది. పలివేల్పుల శివారు వద్ద ఇటుకల లోడుతో వెళ్తున్న లారీ అదుపుతప్పి రోడ్డుపైనే బోల్తా పడింది. లారీ బోల్తా పడటంతో అందులోని ఇటుకలు రహదారి పక్కకు చెల్లాచెదురుగా పడిపోయాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే 112కు సమాచారం అందించారు. దీంతో కేయూ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. అయితే పోలీసులు అక్కడికి చేరుకునే సమయానికి లారీ డ్రైవర్ కనిపించలేదు. ప్రమాదంపై వాహన యజమానికి ఫోన్‌లో సమాచారం ఇచ్చి డ్రైవర్ అక్కడి నుంచి వెళ్లిపోయి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. ప్రమాద సమయంలో రహదారిపై వాహనాల రాకపోకలు తక్కువగా ఉండటంతో పెను ప్రమాదం తప్పింది. లారీ బోల్తా పడినప్పటికీ ఎవరికీ ఎలాంటి గాయాలు కాక పోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఘటనపై కేయూ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సందర్శించిన ఎర్రబెల్లి ప్రదీప్ రావు



వరంగల్, సెప్టెంబర్ 06 (నిత్యం నిఘా ప్రతినిధి) : భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్ ఫౌండేషన్, శంకర్ కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో శివనగర్ ప్రాంతంలో నిర్వహించిన ఉచిత కంటి శస్త్ర చికిత్స శిబిరాన్ని బీజేపీ రాష్ట్ర నాయకుడు, వరంగల్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు సందర్శించారు. ఈ సందర్భంగా శిబిరంలో అందిస్తున్న కంటి వైద్య సేవలను ఆయన పరిశీలించారు. వైద్యులతో మాట్లాడి శిబిరంలో అందుతున్న సేవల వివరాలను తెలుసుకున్నారు. అనంతరం వైద్యులు, నిర్వాహకులను అభినందించారు.

వాజేడు టీచర్స్ క్రికెట్ ప్రీమియర్ లీగ్‌లో ట్రైబల్ వెల్ఫేర్ థండర్స్ విజయం



ములుగు జిల్లా/ వాజేడు, సెప్టెంబర్ 06 (నిత్యం నిఘా ప్రతినిధి) : ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన వాజేడు టీచర్స్ క్రికెట్ ప్రీమియర్ లీగ్-1 ఫైనల్‌లో ట్రైబల్ వెల్ఫేర్ థండర్స్ జట్టు విజయం సాధించి ప్రథమ బహుమతిని కైవసం చేసుకుంది. ఫైనల్ మ్యాచ్‌లో పెదగొల్లగూడెం కాంప్లెక్స్ వారియర్స్ జట్టుపై ట్రైబల్ వెల్ఫేర్ థండర్స్ జట్టు విజయం సాధించింది. అనంతరం విజేత జట్టుకు వాజేడు మండల విద్యాశాఖ అధికారి టి. వెంకటేశ్వర్లు చేతుల మీదుగా ప్రథమ బహుమతి, ట్రోఫీని అందజేశారు. టోర్నీలో ప్రథమ ట్రోఫీని కోకిల శ్రీరంగం, SA స్పాన్సర్ చేయగా, ద్వితీయ ట్రోఫీని పి. నాగేశ్వరరావు, SGT స్పాన్సర్ చేశారు. ఉపాధ్యాయుల మధ్య స్నేహభావం, క్రీడాస్ఫూర్తిని పెంపొందించేలా టోర్నీ ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది. కార్యక్రమంలో ఇరు జట్ల కెప్టెన్లు బద్రి, రాజేష్‌తో పాటు జట్టు సభ్యులు నాగేంద్ర ప్రసాద్, జి. అనిల్, ఈ. అనిల్, పవన్, చంద్రకాంత్, నరసింహ, సాగర్, రాంబాబు, జయేందర్, బాలాజీ, నర్సింగరావు, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

కుమ్మరులకు కేటాయించిన రెండు ఎకరాల భూమికి హద్దులు చూపించాలి



హన్మకొండ,సెప్టెంబర్06(నిత్యం నిఘా ప్రతినిధి): హనుమకొండ నగరంలోని 54వ డివిజన్ పోచమ్మకుంట ప్రాంతంలో కుమ్మరుల కోసం కేటాయించిన రెండు ఎకరాల భూమి విషయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించాలని తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం హనుమకొండ జిల్లా నాయకులు కోరారు.కుమ్మరుల సంక్షేమం కోసం గతంలో కేటాయించిన రెండు ఎకరాల భూమికి సంబంధించి తమ వద్ద ఉన్న అప్రూవల్ కాపీలను సంబంధిత ప్రజాప్రతినిధులు, అధికారులకు అందజేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ముందుగా తమకు కేటాయించిన భూమికి స్పష్టమైన హద్దులు చూపించి, భూమిని తమకు అప్పగించిన అనంతరం మిగతా భూమికి సంబంధించి ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నా తమకు అభ్యంతరం లేదని స్పష్టం చేశారు.అయితే తమకు కేటాయించిన భూమిని ఇతర కమ్యూనిటీకి కేటాయించడం లేదా అక్కడ ఇతరులకు భూమిపూజ చేయడం సరికాదని అన్నారు. అలా చేయడం వల్ల కులాల మధ్య అనవసరమైన అపోహలు, విభేదాలు ఏర్పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.తమ హక్కుగా భావిస్తున్న రెండు ఎకరాల భూమికి ముందుగా సర్వే నిర్వహించి, హద్దులు నిర్ణయించి, తమకు అప్పగించాలని కోరారు. ఈ ప్రక్రియ పూర్తయ్యే వరకు ఆ స్థలంలో ఇతరులకు ఎలాంటి భూమిపూజలు, కేటాయింపులు లేదా నిర్మాణ కార్యక్రమాలు చేపట్టవద్దని విజ్ఞప్తి చేశారు.ఈ విషయంపై సంబంధిత ప్రజాప్రతినిధులు, అధికారులు తక్షణమే స్పందించి సమస్యను సామరస్యపూర్వకంగా పరిష్కరించాలని కోరారు. తమ విజ్ఞప్తిని పట్టించుకోకుండా ముందుకు వెళితే హనుమకొండ జిల్లాలోని కుమ్మరులు ఐక్యంగా ఉద్యమించాల్సి వస్తుందని హెచ్చరించారు. అవసరమైతే పార్టీ కార్యాలయం ఎదుట నిరాహార దీక్షలు, రాస్తారోకోలు చేపట్టేందుకు కూడా వెనుకాడబోమని స్పష్టం చేశారు.కులాల మధ్య చిచ్చు పెట్టే విధంగా నిర్ణయాలు తీసుకోకుండా, అన్ని వర్గాల హక్కులను గౌరవిస్తూ సమస్యను పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం హనుమకొండ జిల్లా నాయకులు కోరారు.

– తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం,హనుమకొండ జిల్లా

పట్టాలు, యాప్‌ల పేరుతో రైతుల రెక్కలు విరవొద్దు



ములుగు జిల్లా/వెంకటాపురం, సెప్టెంబర్ 06 (నిత్యం నిఘా ప్రతినిధి) : ఎరువుల పంపిణీకి పట్టాదారు పాస్‌బుక్‌లు, ఆధార్ లింకింగ్, మొబైల్ యాప్‌లు వంటి సాంకేతిక నిబంధనలు విధించడం వల్ల సామాన్య రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలంగాణ ఉద్యమకారుడు, సామాజిక కార్యకర్త, ఏజెన్సీ నేతకాని కుల హక్కుల పోరాట సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు జాడి ఈశ్వర్ నేతకాని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులపై విధించిన సాంకేతిక ఆంక్షలను తక్షణమే ఎత్తివేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. చదువురాని, స్మార్ట్‌ఫోన్ వినియోగంపై అవగాహన లేని రైతులను యాప్‌లు, ఓటీపీలు, సర్వర్ సమస్యల పేరుతో ఎరువుల కోసం రోజుల తరబడి తిప్పడం సరికాదన్నారు. చేనులో పనిచేయాల్సిన రైతులు ఎరువుల దుకాణాలు, సొసైటీల వద్ద గంటల తరబడి క్యూలో నిలబడాల్సి వస్తోందని పేర్కొన్నారు.

పట్టాల్లేని రైతులకు ఎరువులు ఎలా?

ఏజెన్సీ ప్రాంతాల్లో తరతరాలుగా హక్కు పత్రాలు లేకుండానే భూములను సాగు చేసుకుంటున్న నేతకాని, దళిత, గిరిజన, నిరుపేద రైతుల పరిస్థితి ఏమిటని ఈశ్వర్ ప్రశ్నించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కౌలు రైతుల సమస్యలను కూడా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. పట్టా ఉంటేనే ఎరువులు ఇస్తామనే నిబంధనతో పట్టాల్లేని రైతులు వ్యవసాయం చేయలేని పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

పెరిగిన సాగు ఖర్చులు.. దక్కని గిట్టుబాటు ధర

డీజిల్, ట్రాక్టర్ ఛార్జీలు, విత్తనాలు, కూలీల రేట్లు, ఎరువులు, పురుగుమందుల ధరలు పెరగడంతో సాగు ఖర్చులు విపరీతంగా పెరిగాయని తెలిపారు. ఎకరాకు భారీగా పెట్టుబడి పెట్టి పంట పండించినా మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభించక రైతులు నష్టపోతున్నారని అన్నారు. దళారులు, వ్యాపారుల వ్యవస్థపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పెట్టుబడి ఖర్చులు పెరగడం, పంటలకు సరైన ధర లభించక పోవడం వల్ల రైతులు ప్రైవేట్ వ్యాపారులు, వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి అప్పుల పాలవుతున్నారని పేర్కొన్నారు. అప్పుల భారం తట్టుకోలేక రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నా ప్రభుత్వాలు తగిన స్థాయిలో స్పందించడం లేదని విమర్శించారు.

ప్రభుత్వాలు తక్షణమే స్పందించాలి

రైతు సంక్షేమంపై రాజకీయ నాయకులు చేస్తున్న ప్రకటనలు ఆచరణలో కనిపించడం లేదని ఈశ్వర్ నేతకాని విమర్శించారు. రైతులకు ఎరువులు, విత్తనాలు, సాగునీరు, ఇంధనం సకాలంలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఏజెన్సీ నేతకాని కుల హక్కుల పోరాట సంఘం ప్రధాన డిమాండ్లు:

- ★ ఎరువుల విక్రయాలకు సంబంధించిన పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ ఓటీపీ, సంక్లిష్టమైన యాప్ నిబంధనలను సులభతరం చేయాలి లేదా రద్దు చేయాలి.
- ★ ఏజెన్సీ ప్రాంతంలోని పట్టాల్లేని సాగుదారులు, నిరుపేద రైతులు, కౌలు రైతులకు గుర్తింపు ఆధారంగా ఎరువులు అందించాలి
- ★ ఎరువులు, పురుగుమందుల ధరలను నియంత్రించి రైతులకు సబ్సిడీ పెంచాలి.
- ★ ప్రతి పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తూ చట్టబద్ధమైన హామీ ఇవ్వాలి
- ★ రైతు ఆత్మహత్యలను నివారించేందుకు సమగ్ర చర్యలు తీసుకోవడంతో పాటు బాధిత కుటుంబాలకు తక్షణ పరిహారం అందించాలి.
- ★ రుణమాఫీ పథకం అర్హులైన రైతులందరికీ సక్రమంగా వర్తింపజేయాలి

రైతులు పండించిన పంటకు అవసరమైన ఎరువులు, సాగు సామగ్రి సులభంగా అందుబాటులో ఉండటం వారి ప్రాథమిక హక్కు అని ఈశ్వర్ నేతకాని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించకపోతే రైతులతో కలిసి ఏజెన్సీ నేతకాని కుల హక్కుల పోరాట సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

విద్యుత్ కోతలతో రైతుల అవస్థలు



ములుగు జిల్లా/ తాడ్వాయి , సెప్టెంబర్ 06 (నిత్యం నిఘా ప్రతినిధి) : విద్యుత్ కోతలు, లోవోల్టేజీ సమస్యలతో తాడ్వాయి మండల పరిధిలోని దామరవాయి గ్రామపంచాయతీతో పాటు కాటాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఆరు గ్రామపంచాయతీల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపిస్తున్నారు. ఇటీవల వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో అనేక మంది రైతులు నీటి ఎద్దడి కారణంగా వరి నాట్లు వేయడాన్ని విరమించుకున్నారని తెలిపారు. బోరు సౌకర్యం ఉన్న రైతులు భూగర్భ జలాలను వినియోగించుకుని కొంతమేర వరి సాగు చేస్తున్నప్పటికీ, విద్యుత్ కోతలు వారి కష్టాలను మరింత పెంచుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతిరోజూ రాత్రి సుమారు 8 గంటల సమయంలో విద్యుత్ ట్రిప్ అవుతుండగా, అర గంటకుపైగా సమయం తర్వాత సరఫరా పునరుద్ధరిస్తున్నారని రైతులు చెబుతున్నారు. దీంతో మోటార్లు నడపలేక పంటలకు నీరందించడంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. మరోవైపు సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న సమయంలో తరచూ విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు దోమల బెడదతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. డెంగ్యూ వంటి వ్యాధుల వ్యాప్తి పెరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

లోవోల్టేజీతో మోటార్లు కాలిపోతున్నాయి

మొక్కజొన్న, మిర్చి తదితర పంటలు సాగు చేస్తున్న రైతులకు కూడా విద్యుత్ సమస్యలు తప్పడం లేదని తెలిపారు. త్రీఫేజ్ విద్యుత్ సక్రమంగా అందకపోవడంతో పాటు లోవోల్టేజీ కారణంగా వ్యవసాయ మోటార్లు కాలిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. దీంతో అదనపు ఖర్చులు భరించాల్సి వస్తోందని పేర్కొన్నారు. కాటాపూర్ సబ్‌స్టేషన్ ఉన్నప్పటికీ అక్కడ సరిపడా సిబ్బంది లేకపోవడం వల్లే సమస్యలు తలెత్తుతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. లైన్ ఇన్‌స్పెక్టర్, లైన్‌మెన్‌లను సంప్రదించగా పూర్తిస్థాయిలో సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని సమాధానం ఇస్తున్నారని తెలిపారు.

12 గంటల త్రీఫేజ్ విద్యుత్ అందించాలి

ఇప్పటికైనా సంబంధిత విద్యుత్ అధికారులు స్పందించి రైతులకు నిరంతరాయంగా 12 గంటల త్రీఫేజ్ విద్యుత్ సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. సమస్య పరిష్కారం కాకపోతే తీవ్ర స్థాయిలో నిరసనలు చేపడతామని హెచ్చరించారు. విద్యుత్ కోతల సమస్య ఇలాగే కొనసాగితే రైతులు, ప్రజలతో కలిసి కాటాపూర్ సబ్‌స్టేషన్‌ను ముట్టడించాల్సి వస్తుందని హెచ్చరించారు. సమస్యకు పూర్తి బాధ్యత విద్యుత్ అధికారులదేనని స్థానిక రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

Nityam Nigha 07.09.26_Layout 1 07-09-2026 01:59 AM Page 4

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై బీఆర్ఎస్ భారీ నిరసన



వరంగల్, సెప్టెంబర్ 06 (నిత్యం నిఘా ప్రతినిధి) : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తయిన సందర్భంగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన వారం రోజుల నిరసన కార్యక్రమాల్లో భాగంగా వరంగల్ నగరంలో భారీ ఆందోళన నిర్వహించారు. ప్రజలు, ఆటో కార్మికులు, మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ర్యాలీ చేపట్టి నిరసన తెలిపారు. వరంగల్ తూర్పు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ నివాసం నుంచి సుమారు 200 ఆటోలతో ర్యాలీ ప్రారంభమైంది. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, కార్మిక సంఘాల నాయకులు, ఆటో డ్రైవర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నగరంలోని వివిధ ప్రాంతాల మీదుగా ర్యాలీ కొనసాగి ఎంజీఎం సెంటర్‌కు చేరుకుంది. అక్కడ రాస్తారోకో నిర్వహించి ప్రభుత్వ విధానాలపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. వరంగల్ నగరంలో తాగునీరు, పారిశుధ్య సమస్యలు తీవ్రంగా ఉన్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.

మున్సిపల్ కార్మికుల వేతనాలపై ఆందోళన

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బంది, డ్రైవర్లు, జవాన్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, మలేరియా సిబ్బంది తదితరుల వేతనాలను తగ్గించే ప్రయత్నాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో, కేటీఆర్ మున్సిపల్ శాఖ మంత్రిగా ఉన్న సమయంలో మున్సిపల్ కార్మికుల వేతనాలు పెంచి వారికి భరోసా కల్పించామని గుర్తు చేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం పెంచిన వేతనాలను తగ్గించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు.

ఆటో కార్మికుల హామీలు అమలు చేయాలి

ఎన్నికల సమయంలో ఆటో కార్మికులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని బీఆర్ఎస్ డిమాండ్ చేసింది. నెలకు రూ.12 వేల ఆర్థిక సహాయం, రూ.10 లక్షల బీమా, ఆటో కార్మికుల కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు తదితర హామీలను ప్రభుత్వం అమలు చేయడం లేదని విమర్శించింది. ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రజలు, కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పోరాటం కొనసాగుతుందని నాయకులు స్పష్టం చేశారు.

రమాదేవి ఆకస్మిక మరణం పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన మడే పూర్ణిమ



ములుగు జిల్లా/ తాడ్వాయి, సెప్టెంబర్ 06 (నిత్యం నిఘా ప్రతినిధి) : ములుగు జిల్లా తాడ్వాయి మండలం భూపతిపూర్ గ్రామానికి చెందిన జడ్పర్ల సమ్మయ్య కుమార్తె రమాదేవి అనారోగ్య కారణాలతో మృతి చెందారు. ఆదివారం స్వగ్రామంలో ఆమె అంత్యక్రియలు నిర్వహించారు. ఈ విషయం తెలుసుకున్న ములుగు జిల్లా కాంగ్రెస్ నాయకురాలు మడే పూర్ణిమ రమాదేవి పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అంతిమయాత్రలో చివరి వరకు పాల్గొని కుటుంబ సభ్యులకు అండగా నిలిచారు. రమాదేవి మృతి కుటుంబానికి తీరని లోటని మడే పూర్ణిమ పేర్కొన్నారు. ఆప్తురాలిని కోల్పోయిన బాధలో ఉన్న కుటుంబ సభ్యులు ధైర్యాన్ని కూడగట్టుకోవాలని కోరారు. కుటుంబ సభ్యులు శోకసంద్రంలో ఉండటం పట్ల ఆమె తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ, వారికి మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు.ఈ అంతిమయాత్రలో గంగారం మాజీ సర్పంచ్ ఎట్టి సమ్మయ్య, ఎట్టి సూరయ్యతో పాటు కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకులు, కార్యకర్తలు, వివిధ నాయకులు, గ్రామస్థులు, బంధువులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పేదలకు సీఎంఆర్ఎఫ్ కొండంత అండ



హనుమకొండ, సెప్టెంబర్ 06 (నిత్యం నిఘా ప్రతినిధి) : అనారోగ్యంతో బాధపడుతూ వైద్య ఖర్చులు భరించలేని పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) అండగా నిలుస్తోందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం బాలసముద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన 123 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.32.40 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. అనారోగ్యంతో బాధపడుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలపై వైద్య ఖర్చుల భారం పడకుండా ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం అందిస్తోందన్నారు. ఆపదలో ఉన్న కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ సీఎంఆర్ఎఫ్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

వాతావరణ మార్పులపై సరిహద్దులు దాటి పోరాడాలి



థింపూ (భూటాన్), సెప్టెంబర్ 06 (నిత్యం నిఘా ప్రతినిధి) : వాతావరణ మార్పులు ప్రపంచానికి పెనుసవాలుగా మారుతున్న నేపథ్యంలో దక్షిణాసియా దేశాలు సరిహద్దులను దాటి సమష్టి కార్యాచరణతో ముందుకు సాగాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డా. కడియం కావ్య పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణ, వాతావరణ మార్పులను ఎదుర్కోవడం ఒక్క దేశం బాధ్యత కాదని, భవిష్యత్ తరాల కోసం ప్రాంతీయ సహకారంతో సమగ్ర పరిష్కారాలను అన్వేషించాల్సిన అవసరం ఉందని అన్నారు. భూటాన్ రాజధాని థింపూలో జరుగుతున్న సౌత్ ఏషియా పార్లమెంటరీ డైలాగ్ ఆన్ ఎన్విరాన్‌మెంట్, క్లైమేట్ అండ్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో డా. కడియం కావ్య పాల్గొన్నారు. దక్షిణాసియా దేశాలకు చెందిన పార్లమెంటేరియన్లు, విధాన నిర్ణేతలు, నిపుణులు పాల్గొన్న ఈ సదస్సులో పర్యావరణ పరిరక్షణ, వాతావరణ మార్పులు, సుస్థిర అభివృద్ధిపై చర్చించారు. ఈ సందర్భంగా డా. కడియం కావ్య మాట్లాడుతూ.. వాతావరణ మార్పుల ప్రభావం ఇప్పటికే ప్రజల జీవన విధానంపై స్పష్టంగా కనిపిస్తోందన్నారు. అధిక ఉష్ణోగ్రతలు, అనియంత్రిత వర్షాలు, వరదలు, కరువులు, నీటి కొరత వంటి పరిణామాలు వ్యవసాయం, జీవనోపాధి, ప్రజారోగ్యం, ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని తెలిపారు. వాతావరణ మార్పులకు సరిహద్దులు లేవు. కాబట్టి పరిష్కారాలకు కూడా సరిహద్దులు ఉండకూడదు. దక్షిణాసియా దేశాలు పరస్పర సహకారంతో పనిచేసినప్పుడే వాతావరణ సంక్షోభాన్ని సమర్థంగా ఎదుర్కోగలం అని ఆమె పేర్కొన్నారు. పునరుత్పాదక ఇంధనం, స్వచ్ఛమైన ఇంధన వనరులు, నీటి సంరక్షణ, హరిత మౌలిక వసతులు, జీవవైవిధ్య పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఆర్థికాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ రెండింటినీ సమతుల్యంగా ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు.

రైతులు, మహిళలు, యువతకు ప్రాధాన్యం

వాతావరణ మార్పుల ప్రభావాన్ని ప్రత్యక్షంగా ఎదుర్కొంటున్న రైతులు, మహిళలు, యువత, పేదలు, అట్టడుగు వర్గాల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని విధానాలను రూపొందించాలని ఎంపీ సూచించారు. వాతావరణ మార్పులకు అనుగుణంగా వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడంతో పాటు నీటి నిర్వహణ, విపత్తుల ముందస్తు హెచ్చరిక వ్యవస్థలను బలోపేతం చేయాలని అన్నారు.

భారత్ అనుభవాలను పంచుకోవాలి

వాతావరణ మార్పులను ఎదుర్కొనేందుకు భారత్ చేపడుతున్న పునరుత్పాదక ఇంధనం, హరిత అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాల అనుభవాలను దక్షిణాసియా దేశాలతో పంచుకోవాల్సిన అవసరం ఉందని డా. కడియం కావ్య అన్నారు. పార్లమెంటేరియన్ల మధ్య ఇలాంటి సంభాషణలు మరింత పెరగాలని, ఉమ్మడి సమస్యలపై ఉమ్మడి విధానాలు, కార్యాచరణ రూపొందించుకోవాలని ఆకాంక్షించారు. ఆర్థికాభివృద్ధితో పాటు ప్రకృతి వనరులను కాపాడటం ప్రతి ప్రభుత్వ బాధ్యత అని ఆమె పేర్కొన్నారు. “ఈరోజు తీసుకునే నిర్ణయాలే రేపటి తరాల భవిష్యత్తును నిర్ణయిస్తాయి. అభివృద్ధి అంటే ప్రకృతిని నాశనం చేయడం కాదు.. ప్రకృతిని కాపాడుతూ అభివృద్ధి సాధించడమే నిజమైన సుస్థిర అభివృద్ధి” అని డా. కడియం కావ్య స్పష్టం చేశారు. భూటాన్ వేదికగా జరుగుతున్న ఈ పార్లమెంటరీ డైలాగ్ దక్షిణాసియా దేశాల మధ్య పర్యావరణ, వాతావరణ విధానాలపై సమన్వయానికి కీలక వేదికగా నిలుస్తోందని ఆమె పేర్కొన్నారు.

భార్యతో సంబంధం ఉందన్న అనుమానంతో కత్తితో దాడి



పెద్దపల్లి జిల్లా/ మంథని, సెప్టెంబర్ 06 (నిత్యం నిఘా ప్రతినిధి) : భార్యతో సంబంధం ఉందన్న పాత అనుమానంతో ఓ వ్యక్తిపై కత్తితో దాడికి పాల్పడిన ఘటనలో నిందితుడిని మంథని పోలీసులు అరెస్టు చేసి న్యాయ నిర్బంధానికి తరలించారు. నిందితుడి నుంచి నేరానికి ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఆరెంద గ్రామానికి చెందిన గడుపు చిన్న బానయ్యకు, మల్లారం ఎస్సీ కాలనీకి చెందిన పుల్లూరి శ్రీధర్‌పై గతంలో తన భార్యతో సంబంధం ఉందన్న అనుమానం ఉంది. ఈ క్రమంలో ఈ నెల 3న రాత్రి సుమారు 9.30 గంటల సమయంలో మల్లారం ఎస్సీ కాలనీలో శ్రీధర్‌పై ముందస్తు ప్రణాళికతో కత్తితో దాడి చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ దాడిలో శ్రీధర్ తలకు కత్తి గాయం కాగా, దాడిని అడ్డుకునే క్రమంలో ఎడమ చేతికి కూడా తీవ్ర గాయమైంది. తీవ్ర రక్తస్రావం కావడంతో వెంటనే మంథని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ సివిల్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఈ నెల 4న సాయంత్రం మంథని పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 203/2026గా కేసు నమోదు చేశారు. బీఎన్ఎస్ సెక్షన్ 109 కింద హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా ఈ నెల 5న ఉదయం 11 గంటల సమయంలో అందిన విశ్వసనీయ సమాచారంతో ఆరెంద గ్రామంలో నిందితుడు గడుపు చిన్న బానయ్యను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి నేరానికి ఉపయోగించిన కత్తిని పంచనామా ద్వారా స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడిని మంథని ప్రథమ శ్రేణి జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం ఆదేశాల మేరకు జ్యుడీషియల్ కస్టడీకి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

హామీల అమలుకు ఆటో డ్రైవర్ల భారీ ర్యాలీ

హనుమకొండ, సెప్టెంబర్ 06 (నిత్యం నిఘా ప్రతినిధి) : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఆటో డ్రైవర్ల యూనియన్ ఆధ్వర్యంలో హనుమకొండలో భారీ ఆటో ర్యాలీ నిర్వహించారు. ములుగు రోడ్డు జంక్షన్ నుంచి ప్రారంభమైన ర్యాలీ నగరంలోని ప్రధాన మార్గాల మీదుగా హనుమకొండ చౌరస్తా వరకు కొనసాగింది. ఈ సందర్భంగా మన తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షుడు సంజీవ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు గడుస్తున్నా ఎన్నికల సమయంలో ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కదానినీ పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు ప్రయాణం కారణంగా ఆటో డ్రైవర్లు ఉపాధి కోల్పోయి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ఉపాధి కోల్పోయిన ఆటో డ్రైవర్లను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని సంజీవ్ డిమాండ్ చేశారు. ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. ప్రతి ఏటా ఆటో డ్రైవర్లకు రూ.12 వేల ఆర్థిక సహాయం అందించాలని, ప్రమాదాల సమయంలో కుటుంబాలను ఆదుకునేలా ప్రమాద బీమా సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించకపోతే రాబోయే రోజుల్లో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ర్యాలీలో యూనియన్ నాయకులు, పెద్ద సంఖ్యలో ఆటో డ్రైవర్లు పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా తమ నిరసనను వ్యక్తం చేశారు.



Nityam Nigha 07.09.26_Layout 1 07-09-2026 01:59 AM Page 5

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై జమ్మికుంటలో బీఆర్ఎస్ ఆటో ర్యాలీ

కరీంనగర్ జిల్లా / జమ్మికుంట, సెప్టెంబర్ 06 (నిత్యం నిఘా ప్రతినిధి) : కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ఆటో కార్మికులు, పేదలు, మధ్యతరగతి ప్రజల సమస్యలను పట్టించుకోలేదని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఆదేశాలతో జమ్మికుంట పట్టణంలో ఆటో కార్మికులకు మద్దతుగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్‌కుమార్ దిలీప్ పాల్గొని ఆటో కార్మికులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోజువారీ ఆదాయంపై ఆధారపడి కుటుంబాలను పోషించుకునే ఆటో కార్మికుల జీవనం భారంగా మారిందన్నారు. ఆటో కిస్తీలు, ఇంటి అద్దెలు, పిల్లల విద్య, వైద్య ఖర్చులు భరించలేక వారు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా ఆటో కార్మికులకు హామీ ఇచ్చిన రూ.12 వేల ఆర్థిక సహాయాన్ని తక్షణమే అందించాలని, సబ్సిడీ రుణాలు కల్పించాలని కోరారు. ఆధునిక ఎలక్ట్రిక్ ఆటోల ద్వారా ఆటో కార్మికుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆటో కార్మికుల సంక్షేమానికి చేపట్టిన కార్యక్రమాలను కొనసాగిస్తూ వారి జీవనోపాధికి ప్రభుత్వం అండగా నిలవాలని అన్నారు. పేదలు, మధ్యతరగతి ప్రజలు, చిరు వ్యాపారులు, కార్మిక



వర్గాల సమస్యలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రజల కష్టాలు తీర్చడమే నిజమైన ప్రజా పాలన. హామీలు ఇవ్వడం కాదు.. వాటిని అమలు చేయడమే ప్రభుత్వ బాధ్యత" అని మొలుగు ప్రశాంత్‌కుమార్ దిలీప్ అన్నారు. ఆటో కార్మికుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ వారి పక్షాన నిలుస్తుందని, అవసరమైతే హక్కుల కోసం మరింత బలమైన పోరాటం చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ జావేద్, కౌన్సిలర్లు, పీఏసీఎస్ చైర్మన్ పోనగంటి సంపత్, పొడేటి రామస్వామి, పోల్నేని సత్యనారాయణరావు, కేడీసీసీ వైస్ చైర్మన్ పింగళి రమేష్, బీఆర్ఎస్ నాయకులు, ఆటో యూనియన్ నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో ఆటో కార్మికులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ క్షేత్రస్థాయి పరిశీలన

మేడారం, సెప్టెంబర్ 06 (నిత్యం నిఘా ప్రతినిధి) : ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం, ఊరట్టం గ్రామపంచాయతీల పరిధిలో ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టనున్న అభివృద్ధి పనులపై ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ ధర్మ ఆదివారం క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు. పర్యటనలో భాగంగా ధర్మ కుటుంబ సమేతంగా మేడారం సమ్మక్క–సారలమ్మ తల్లులను దర్శించుకున్నారు. సమ్మక్క పూజారులు సిద్ధబోయిన జనార్దన్, సిద్ధబోయిన భోజరావు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రసాదం అందజేశారు. అనంతరం ఊరట్టం, మేడారం గ్రామపంచాయతీల పరిధిలో ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనుల కోసం అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించారు. జంపగ వాయి గ్రామ పరిధిలో 200 మీటర్లు, ఊరట్టం పరిధిలో 500 మీటర్ల స్నాన ఘాట్ల నిర్మాణంతో పాటు ఊరట్టం బ్రిడ్జి సమీపంలో రివిట్‌మెంట్ వాల్, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల వైపు కరకట్ట నిర్మాణం తదితర పనులపై సర్వే చేపట్టారు. అలాగే ఊరట్టం గ్రామపంచాయతీ పరిధిలోని చెరువులు, మేడారం గ్రామపంచాయతీ పరిధిలోని శివరాం సాగర్ చెరువు సుందరీకరణ, కొంగలమడుగు చెరువు పునరుద్ధరణ పనులకు సంబంధించిన ప్రాంతాలను పరిశీలించి సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈఈ కొట్టెం నారాయణ, డీఈఈ రవీందర్‌రెడ్డి, ఏఈ రజియా, మేడారం సర్పంచ్ పీరీల భారతి వెంకన్న, సీతక్క యువసేన జిల్లా అధ్యక్షుడు చేర్వ రవీందర్, యాలం రవి తదితరులు పాల్గొన్నారు.





1995-96 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనం

ములుగు జిల్లా / తాడ్వాయి, సెప్టెంబర్ 06 (నిత్యం నిఘా ప్రతినిధి) : 1995–96 విద్యా సంవత్సరంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. వివిధ జిల్లాల్లో నివాసం ఉంటున్న పూర్వ విద్యార్థులు కుటుంబ సమేతంగా ఈ కార్యక్రమానికి హాజరై సందడి చేశారు. స్థానిక ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు సక్కురు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పూర్వ విద్యార్థులు తమ విద్యార్థి దశలోని జ్ఞాపకాలను, అనుభవాలను పరస్పరం పంచుకున్నారు. చాలాకాలం తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు ఆత్మీయంగా మాట్లాడుకుంటూ తమ కుటుంబ పరిస్థితులు, సుఖదుఃఖాలను ఒకరికొకరు వివరించుకున్నారు. భవిష్యత్తులో పాఠశాలకు, విద్యార్థులకు ఉపయోగపడే కార్యక్రమాలతో పాటు ఎలాంటి సామాజిక కార్యక్రమాలు చేపట్టినా తమవంతు సహకారం అందించాలని పూర్వ విద్యార్థులు తీర్మానించారు. అనంతరం పూర్వ విద్యార్థుల కమిటీని ఏకగ్రీవంగా ఏర్పాటు చేశారు.



కమిటీ వివరాలు:
★ గౌరవ అధ్యక్షులు: మంత్రి నరసింహ స్వామి
★ అధ్యక్షులు: కందకట్ల సాంబయ్య
★ ఉపాధ్యక్షులు: పర్వతాల కృష్ణసాయి
★ ప్రధాన కార్యదర్శి: కూచన రాజు
★ కోశాధికారి: గూడూరు రాజేంద్రప్రసాద్
★ మహిళా కార్యదర్శి: కుసుమ రమాదేవి
★ ట్రెజరర్: దిడ్డి మల్లయ్య
కమిటీ సభ్యులు: అమరావతి, బుచ్చి రాములు, వెంకటేశ్వర్లు, ముకుంద్, రహిమాన్, కృష్ణ, రాంబాబు, ఆదినారాయణ తదితరులు. ఈ కార్యక్రమానికి స్థానిక సర్పంచ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పూర్వ ఉపాధ్యాయులు రవీందర్ రెడ్డి, శ్రీహరి, ఎన్నారై పులి రమాదేవితో పాటు పూర్వ విద్యార్థులు గీత, సునీత, అమరావతి, రాధిక, ఎండీ రహిమాన్, వెంకటేశ్వర్లు, వేములేశ్వర్, నీలం బాబు, విజయ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహేష్ అంత్యక్రియల్లో పాల్గొని పాడె మోసిన ఎమ్మెల్యే వెంకట్రావు

భద్రాచలం, సెప్టెంబర్ 06 (నిత్యం నిఘా ప్రతినిధి) : దుమ్ముగూడెం మండలం చిన్నబండిరేవు గ్రామానికి చెందిన తెల్లం జోగయ్య కుమారుడు, భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు సోదరుడి కుమారుడు తెల్లం మహేష్ (మృతి) అంత్యక్రియలు ఆదివారం విషాద వాతావరణంలో నిర్వహించారు. బ్రెయిన్ స్ట్రోక్‌కు గురైన మహేష్ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. మహేష్ మృతదేహానికి ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అంత్యక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్యే స్వయంగా పాడె మోసి మహేష్‌తో తనకున్న ఆత్మీయ అనుబంధాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా మహేష్ మృతి పట్ల ఎమ్మెల్యే తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. విషాద సమయంలో కుటుంబ



సభ్యులకు ధైర్యంగా అండగా నిలిచారు. అంత్యక్రియలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, యూత్ నాయకులు, గ్రామస్థులు, అభిమానులు, బంధువులు తదితరులు హాజరై తెల్లం మహేష్‌కు ఘన నివాళులర్పించారు.

గుండ్లగడ్డ కిష్టబావి శ్రీ లక్ష్మీ గణపతి ఆలయానికి నూతన కమిటీ



జనగామ జిల్లా , సెప్టెంబర్ 06 (నిత్యం నిఘా ప్రతినిధి) : జనగామ పట్టణంలోని గుండ్లగడ్డ కిష్టబావి వద్ద గల శ్రీ లక్ష్మీ గణపతి దేవాలయంలో నూతన ఆలయ కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గత 39 సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలను స్థానికులు, పెద్దలు, యువతీ యువకులు ఐకమత్యంతో ఘనంగా నిర్వహిస్తున్నారు. ప్రతి ఏడాది గణేష్ నవరాత్రుల సందర్భంగా వార్డులో పండుగ వాతావరణం నెలకొంటోంది. కిష్టబావి ప్రాంత ప్రభావంతో ఇక్కడ కొలువైన గణపతి స్వామిని భక్తిశ్రద్ధలతో పూజిస్తే కోరిన కోరికలు నెరవేరుతాయని భక్తుల విశ్వాసం. ఆలయాన్ని మరింత అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో వార్డులోని ప్రముఖులు, యువకులు సమావేశమై నూతన కమిటీని ఏర్పాటు చేశారు. రాబోయే రెండేళ్లపాటు ఆలయ అభివృద్ధికి కృషి చేసేలా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నూతన కమిటీ:
★ గౌరవ అధ్యక్షులు: వడ్నల లింగమూర్తి
★ అధ్యక్షులు: గట్టు రమేశ్
★ ఉపాధ్యక్షులు: చిదిరాల బాబురావు
★ ప్రధాన కార్యదర్శి: గుధినేని త్రయంబకేశ్
★ కోశాధికారి: కోయలకర్ శేషు విరాట్‌జీ
★ సహాయ కార్యదర్శులు: ఆకుల నరేష్, గోగికర్ శివాజీ, కొత్తపల్లి సత్తయ్య
★ ఆర్గనైజర్: చెల్లోజు నవీన్ చారి
★ ముఖ్య సలహాదారులు: ఎర్రమళ్ల సుధాకర్, మిర్యాల రమేష్, కొండ వీరేశం, ఆర్మీ ప్రవీణ్ కుమార్, మురళి.

నూతన కమిటీ ఆధ్వర్యంలో ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసి, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో వార్డు పెద్దలు, యువత, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

భువనపల్లిలో ఘనంగా బొడ్రాయి వేడుకలు





ములుగు జిల్లా/ వాజేడు, సెప్టెంబర్ 6 (నిత్యం నిఘా ప్రతినిధి) : వాజేడు మండలం భువనపల్లి గ్రామంలో గ్రామదేవతల బొడ్రాయి ప్రతిష్ఠాపన వేడుకలు ఆదివారం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా బోనాల రోజున యాగశాల అలంకరణ, నాలుగు దిక్కులా తోరణాల నిర్మాణం, జ్యోతి ప్రజ్వలన, విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, ప్రసాద వితరణ, కర్పూర హారతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. శ్రావణ మాసం సందర్భంగా ఆదివారం సుప్రభాత సేవ, నిత్య పూజలు, అగ్నిహోమాలు, క్షీరాధివాసం, జలాధివాసం, అభిషేకాలు, మంగళహారతి, ఊరేగింపు కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ బొడ్రాయి గ్రామదేవతలను ప్రతిష్ఠించారు. అనంతరం అగ్ని ప్రతిష్ఠాపన, హోమం, బొడ్రాయి ఊరేగింపు, అభిషేకం తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. గ్రామ ఆడపడుచులు పెద్ద సంఖ్యలో బోనాలు సమర్పించి అమ్మవారికి నైవేద్యాలు, ముడుపులు చెల్లించుకున్నారు. మహిళలు మంగళహారతులతో ఊరేగింపుగా వెళ్లి ప్రతిష్ఠించిన బొడ్రాయి దేవతామూర్తులకు నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వేడుకల సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, యువత, భక్తులు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

Nityam Nigha 07.09.26_Layout 1 07-09-2026 01:59 AM Page 6

రంగసాయిపేటలో ఘనంగా పోచమ్మ తల్లి బోనాలు



వరంగల్, సెప్టెంబర్ 06 (నిత్యం నిఘా ప్రతినిధి) : వరంగల్ నగరంలోని రంగసాయిపేటలో పోచమ్మ తల్లి బోనాల ఉత్సవాలను ఆదివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. శ్రావణ మాసం చివరి ఆదివారం సందర్భంగా వివిధ కులాలకు చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో బోనాలతో తరలి వచ్చారు. మహిళలు నెత్తిన బోనాలు ధరించి, డప్పు చప్పుళ్ల నడుమ నృత్యాలు చేస్తూ వీధుల గుండా ఊరేగింపుగా పోచమ్మ తల్లి ఆలయానికి చేరుకున్నారు. అనంతరం ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి బోనాలు, నైవేద్యాలను సమర్పించారు. మొక్కులు చెల్లించుకుని పోచమ్మ తల్లి తమ కుటుంబాలను, ప్రజలందరినీ చల్లగా చూడాలని భక్తులు వేడుకున్నారు. బోనాల సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు, భక్తులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

సభ్యుల కుటుంబాలకు కాకతీయ పరపతి సంఘం అండ





వరంగల్ / వర్ధన్నపేట, సెప్టెంబర్ 06 (నిత్యం నిఘా ప్రతినిధి) : సభ్యుల కుటుంబాలకు అండగా నిలుస్తూ కాకతీయ పరపతి సంఘం తన సేవా కార్యక్రమాలను కొనసాగిస్తోంది. సంఘ సభ్యులు రఘుసాల వెంకటేశ్వర్లు, బొమ్మిదేని శివకుమార్ అకాల మరణంతో వారి కుటుంబాలు విషాదంలో ఉండగా, సంఘం కార్యవర్గం వారికి అండగా నిలిచింది. ఆదివారం సంఘం అధ్యక్షుడు సమ్మెట శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి భానుచందర్ మృతుల నివాసాలకు వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి దుఃఖంలో పాలుపంచుకుని మనోధైర్యం కల్పించారు. అనంతరం సంఘం తరఫున మరణ విపత్తు సహాయం కింద ఇరు కుటుంబాలకు రూ.30 వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ.. సభ్యుల కుటుంబాలకు కాకతీయ పరపతి సంఘం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. సభ్యుల ఆకస్మిక మరణం సంఘానికి తీరని లోటని పేర్కొన్నారు. కష్టకాలంలో సభ్యుల కుటుంబాలకు సహాయం అందించడం సంఘం బాధ్యతగా భావిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో సంఘ కోశాధికారి కొండ గోపాల్, సంఘ సభ్యులు కీర్తి సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

ల్యాబర్తిలో పోచమ్మ బోనాలు.. హోరెత్తిన సంబురాలు!



వరంగల్/ వర్ధన్నపేట, సెప్టెంబర్ 06 (నిత్యం నిఘా ప్రతినిధి) : వర్ధన్నపేట మండలం ల్యాబర్తి గ్రామంలో పోచమ్మ తల్లి బోనాల పండుగ ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. పండుగ సందర్భంగా గ్రామంలో ఎటుచూసినా సందడి నెలకొనగా.. ఆడపడుచుల కోలాటాలు, శివసత్తుల పూనకాలు, భక్తుల జయజయధ్వానాలతో ల్యాబర్తి మార్మోగింది. ఉదయం నుంచే మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి, ప్రత్యేకంగా అలంకరించిన బోనాలతో పోచమ్మ తల్లి ఆలయానికి తరలివచ్చారు. డప్పుల మోతలు, కోలాటాల హోరు, శివసత్తుల పూనకాలు పండుగకు మరింత శోభను తీసుకొచ్చాయి. భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామంలోని ప్రధాన వీధులు పండుగ శోభతో కళకళలాడాయి. చిన్నా, పెద్దా తేడా లేకుండా గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పోచమ్మ తల్లిని దర్శించుకున్నారు. మహిళల కోలాటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవగా.. శివసత్తుల పూనకాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. పోచమ్మ తల్లి ఆశీస్సులతో గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా నిర్వాహకులు, గ్రామ పెద్దలు తగిన ఏర్పాట్లు చేశారు. భక్తి, సంప్రదాయం, సంబురం కలగలిసిన ల్యాబర్తి పోచమ్మ బోనాల పండుగ కన్నులపండువగా సాగింది..

గంగాపురిలో నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటు

పెద్దపల్లి జిల్లా/ మంథని, సెప్టెంబర్ 06 (నిత్యం నిఘా ప్రతినిధి) : మంథని మున్సిపాలిటీ పరిధిలోని గంగాపురి 4వ వార్డులో నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులు ఆదివారం ప్రారంభమయ్యాయి. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, శ్రీనుబాబు సహకారంతో ఈ పనులు చేపట్టినట్లు 4వ వార్డు కౌన్సిలర్ ఎరుకల స్రవంతి రమేష్‌బాబు తెలిపారు. గంగాపురి ప్రాంతంలో విద్యుత్ సరఫరాకు సంబంధించి ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని నూతన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేస్తున్నట్లు కౌన్సిలర్ పేర్కొన్నారు. ఈ పనులు పూర్తయితే విద్యుత్ సరఫరా మరింత మెరుగుపడి, స్థానికంగా నెలకొన్న విద్యుత్ సమస్యలు తగ్గే అవకాశం ఉందన్నారు. విద్యుత్ సౌకర్యాల మెరుగుదలకు సహకరించిన మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, విద్యుత్ శాఖ డీఈ, ఏఈ, లైన్‌మెన్‌తో పాటు సిబ్బందికి కౌన్సిలర్ ఎరుకల స్రవంతి రమేష్‌బాబు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి వార్డులో మౌలిక వసతుల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని ఆమె అన్నారు. ప్రజల సహకారంతో గంగాపురిని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు.



జనగణనలో బీసీల లెక్కలు చేపట్టాల్సిందే



హన్మకొండ/ సెప్టెంబర్ 06 (నిత్యం నిఘా ప్రతినిధి): రాబోయే జాతీయ జనగణనలో బీసీల జనాభాను కచ్చితంగా లెక్కించాలని, జనగణన ఫారంలో ఓబీసీ (OBC) కోసం ప్రత్యేక కాలమ్ ఏర్పాటు చేయాలని బీసీ కుల గణన సాధన సమితి కన్వీనర్, కాకతీయ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ కె. మురళి మనోహర్ డిమాండ్ చేశారు. హనుమకొండలోని కాకతీయ యూనివర్సిటీ జాఫర్ నిజాం హాల్‌లో బీసీ సంఘాల ముఖ్య నాయకులతో ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ప్రొఫెసర్ కె. మురళి మనోహర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం త్వరలో చేపట్టబోయే జాతీయ జనగణనలో ఓబీసీ వర్గాలకు ప్రత్యేక కాలమ్ ఏర్పాటు చేయాలని కోరారు. బీసీల జనగణన చేపట్టకపోతే భవిష్యత్తులో విద్య, ఉద్యోగాలు, రాజకీయ రంగాల్లో బీసీలు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. జనాభా దామాషా ప్రకారం బడ్జెట్ కేటాయింపులు, విద్యాసంస్థల్లో సీట్లు, రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలంటే బీసీల జనాభాపై కచ్చితమైన గణాంకాలు అవసరమని పేర్కొన్నారు. జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీ కులాల అభిప్రాయాలను గౌరవించి కేంద్ర ప్రభుత్వం తక్షణమే జనగణన ఫారంలో ఓబీసీ కాలమ్‌ను చేర్చాలని డిమాండ్ చేశారు.

సెప్టెంబర్ 11న నిరసన దీక్ష

జనగణనలో ఓబీసీ కాలమ్ ఏర్పాటు చేయాలనే డిమాండ్ సాధనలో భాగంగా సెప్టెంబర్ 11న హనుమకొండలోని ఏకశిలా పార్క్ (జయశంకర్ పార్క్) వద్ద ప్రత్యేక నిరసన దీక్ష చేపట్టాలని సమావేశంలో ఏకగ్రీవంగా నిర్ణయించారు. ఈ నిరసన దీక్షకు బీసీ వర్గాలు పార్టీలు, రాజకీయాలకు అతీతంగా పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. సమావేశంలో ప్రొఫెసర్ కె. మురళి మనోహర్, తిరునాహరి శేషు, వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్, తాడిశెట్టి క్రాంతికుమార్, డా. సంగాని మల్లేశ్వర్, సాయిని నరేందర్, గొల్లపల్లి వీరస్వామి, చింతం ప్రవీణ్ కుమార్, రాజకొండ ప్రవీణ్, జనార్దన్, కృష్ణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

భద్రకాళీ అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు





వరంగల్, సెప్టెంబర్ 06 (నిత్యం నిఘా ప్రతినిధి) : వరంగల్ మహానగరంలోని చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళీ దేవస్థానాన్ని ఆదివారం పలువురు ప్రముఖులు సందర్శించి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ అడిషనల్ కమిషనర్ చంద్రశేఖర్ ఆజాద్ ఉదయం శ్రీ భద్రకాళీ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు ఆలయ కార్యనిర్వహణాధికారి రామల సునీత, ప్రధానార్చకులు భద్రకాళీ శేషు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆజాద్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహింపజేశారు. పూజా కార్యక్రమాల అనంతరం ప్రధానార్చకులు మహదాశీర్వచనం నిర్వహించి అమ్మవారి శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్యనిర్వహణాధికారులు జ్ఞానేశ్వర్ రెడ్డి, రాజేంద్రం, మేడారం ఈఓ ఎం. వీరస్వామి, రత్నాకర్ శర్మ తదితరులు పాల్గొన్నారు. అనంతరం వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేత కుటుంబ సమేతంగా శ్రీ భద్రకాళీ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజ అనంతరం ఆలయ ప్రధానార్చకులు సీపీ కుటుంబ సభ్యులకు మహదాశీర్వచనం అందించి అమ్మవారి శేష వస్త్రాలు, ప్రసాదాలను బహూకరించారు. ఆదివారం కావడంతో భద్రకాళీ ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనపై బీఆర్ఎస్ నిరసన



వరంగల్ / సంగెం, సెప్టెంబర్ 6 (నిత్యం నిఘా ప్రతినిధి) : కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ సంగెం మండలం నార్లవాయి గ్రామంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. బీఆర్ఎస్ సర్పంచ్ సింగిరెడ్డి అనిల్ రాజ్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామంలోని వివిధ ప్రాంతాల్లో ప్రజలను కలిసి కాంగ్రెస్ ప్రభుత్వ హామీలు, వాటి అమలు తీరుపై వివరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సింగిరెడ్డి అనిల్ రాజ్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఆరోపించారు. రైతులు, మహిళలు, యువత, పేదలు, నిరుద్యోగులు సహా వివిధ వర్గాలకు ఇచ్చిన హామీల పరిస్థితిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకే ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు.“కాంగ్రెస్ బాకీ” కార్డుల ద్వారా ప్రభుత్వం అమలు చేయాల్సిన హామీలను ప్రజలకు వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించిన ఆయ–న.. ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుపై ప్రజలు నిలదీయాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ నిరంతరం పోరాడుతుందని నాయకులు పేర్కొన్నారు. గ్రామంలోని ప్రజలను కలుసుకుని కాంగ్రెస్ హామీలు, వాటి అమలు పరిస్థితిని వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సింగిరెడ్డి కుమారస్వామి, ఉప సర్పంచ్ దామెర రమ్య నవీన్, మాదినేని రాజు, చల్ల అనిల్, దామెర నరేందర్, దామెర స్వామి, మొగిలి అరుణ, కూస రమేష్, చల్ల నాగరాజు, సింగిరెడ్డి రాజకుమార్, రొట్టె అనిల్, పసుల అశోక్‌తో పాటు బీఆర్ఎస్ నాయకులు, యూత్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

Nityam Nigha 07.09.26_Layout 1 07-09-2026 01:59 AM Page 7

వినూత్న మిల్లెట్ ఉత్పత్తులతో స్వయం ఉపాధికి అవకాశాలు



హనుమకొండ, సెప్టెంబర్ 06 (నిత్యం నిఘా ప్రతినిధి) : మిల్లెట్ ఆధారిత వినూత్న ఉత్పత్తులను తయారు చేయడం ద్వారా ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించడంతో పాటు స్వయం ఉపాధి అవకాశాలను మెరుగుపరుచుకోవచ్చని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అన్నారు. ఆదివారం హనుమకొండ గోపాల్‌పూర్ జవహర్ కాలనీలో ఐఐఎంఆర్ న్యూట్రిహబ్ ప్రోత్సాహంతో యువ పారిశ్రామికవేత్త ఉజ్వల చంద్రగిరి ఏర్పాటు చేసిన అరిస్సా గ్రోత్ ఫార్మ్స్ మిల్లెట్ పన్నీర్ మాన్యుఫ్యాక్చరింగ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉత్పత్తి యూనిట్‌కు సంబంధించిన వివరాలను నిర్వాహకురాలు ఉజ్వల చంద్రగిరిని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. హనుమకొండలో దేశంలోనే తొలిసారిగా ప్లాంట్ బేస్డ్ మిల్లెట్ పన్నీర్ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేసినట్లు ఆమె వివరించారు. ఈ యూనిట్‌లో పాల ఉత్పత్తులకు బదులుగా మొక్కల నుంచి లభించే ప్రోటీన్‌ను ఉపయోగించి నాన్-డెయిరీ మిల్లెట్ పన్నీర్‌తో పాటు మిల్లెట్ బాసుంది వంటి పోషక విలువలు కలిగిన ఆహార ఉత్పత్తులను తయారు చేస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్యకరమైన, పోషక విలువలతో కూడిన ప్రత్యామ్నాయ ఆహార ఉత్పత్తుల తయారీకి ఈ యూనిట్ దోహదపడుతుందని పేర్కొన్నారు. హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్ రీసెర్చ్ (IIMR) ఆధ్వర్యంలో ఆర్వీవీఐ-రాఫ్తార్ కార్యక్రమం ద్వారా లభించిన సాంకేతిక సహకారంతో ఈ పరిశ్రమను ఏర్పాటు చేసినట్లు ఉజ్వల వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి మాట్లాడుతూ.. మిల్లెట్ ఆధారిత ఉత్పత్తుల తయారీలో ఐఐఎంఆర్ వంటి సంస్థల సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని మరిన్ని వినూత్న ఉత్పత్తులను అభివృద్ధి చేయాలని సూచించారు. ప్రస్తుతం ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలకు విస్తృతమైన డిమాండ్ ఉందని, నిరుద్యోగ యువత నూతన పరిశ్రమలను ఏర్పాటు చేసుకుని స్వయం ఉపాధి సాధించాలని అన్నారు. మిల్లెట్ ఉత్పత్తుల తయారీ రంగంలో మహిళలు,యువతకు స్వయం ఉపాధి, ఆర్థిక సాధికారతకు విస్తృత అవకాశాలుఉన్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న వివిధ ప్రోత్సాహకాలు, పథకాలను సద్వినియోగం చేసుకుని ఉపాధి అవకాశాలను సృష్టించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్ రీసెర్చ్ న్యూట్రిహబ్‌కు చెందిన డాక్టర్ జె. స్టాన్లే, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నవీన్ కుమార్, న్యూట్రిహబ్ బృందం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నా : ఎమ్మెల్యే నాయిని



హనుమకొండ, సెప్టెంబర్ 06 (నిత్యం నిఘా ప్రతినిధి) :
ఎన్నికల ముందు పాదయాత్రలు, ప్రజలతో సమావేశాల సందర్భంగా ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నానని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి సమస్యపై ప్రత్యేక దృష్టి సారించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని 54వ డివిజన్ పోచమ్మకుంటలో రూ.40 లక్షలతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు ఆదివారం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. పోచమ్మ బోనాల సందర్భంగా పోచమ్మ దేవాలయంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పోచమ్మకుంట తనకు ప్రత్యేకమైన ప్రాంతమని, తన నివాసం కూడా ఇదే డివిజన్‌లో ఉన్నందున ఈ ప్రాంత అభివృద్ధిపై మరింత శ్రద్ధ వహిస్తున్నానని తెలిపారు. ప్రజలు తమకు అవసరమైన అభివృద్ధి పనులపై ప్రతిపాదనలు అందిస్తే ప్రాధాన్యత క్రమంలో వాటిని పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. పోచమ్మకుంటలో కమ్యూనిటీ భవన్ నిర్మాణం, పోచమ్మ దేవాలయ అభివృద్ధి, అంతర్గత రోడ్ల నిర్మాణం తదితర పనులకు నిధులు కేటాయించినట్లు తెలిపారు. రోడ్ల పరిస్థితిని త్వరలో పరిశీలించి అవసరమైన ప్రాంతాలను గుర్తించి పనులు చేపడతామని చెప్పారు. అదేవిధంగా పోచమ్మకుంట శ్మశానవాటికను ఆధునికంగా, సుందరంగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే వెల్లడించారు. గార్డెన్ తరహాలో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించడంతో పాటు అవసరమైన గదులు, ఇతర మౌలిక వసతులను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని, అభివృద్ధి పనుల విషయంలో తాను ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటానని నాయిని స్పష్టం చేశారు. రెవెన్యూ, పోలీస్ శాఖల సమన్వయంతో ప్రజలకు ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని అన్నారు. గత పాలనలో జరిగిన అభివృద్ధి, ప్రస్తుత ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు బేరీజు వేసుకోవాలని సూచించారు. కులం, పార్టీకి అతీతంగా ప్రజలకు ఎవరు అభివృద్ధి చేస్తారో వారిని ఆదరించాలని కోరారు. ఇళ్లులేని పేదలకు ఇందిరమ్మ ఇళ్లతో పాటు ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న కొత్త గృహ నిర్మాణ పథకాల ద్వారా ప్రయోజనం కల్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. పోచమ్మకుంటను ప్రత్యేకంగా దత్తత తీసుకుని అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగంగా ముందుకు తీసుకెళ్తానని ఎమ్మెల్యే నాయిని పునరుద్ఘాటించారు.

పోలీస్ ఉద్యోగార్థులకు 70 రోజుల ఉచిత శిక్షణ



భూపాలపల్లి, సెప్టెంబర్ 06 (నిత్యం నిఘా ప్రతినిధి) :
పోలీస్ ఉద్యోగ నోటిఫికేషన్‌ను దృష్టిలో ఉంచుకుని భూపాలపల్లి జిల్లా నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ అందించేందుకు ఏర్పాటు చేసిన ఎంపిక ప్రక్రియలో భాగంగా ఆదివారం శారీరక, రాత పరీక్షలు నిర్వహించారు. జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పరీక్షలకు జిల్లావ్యాప్తంగా సుమారు 350 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఉచిత డేస్ స్కాలర్ శిక్షణ శిబిరం కోసం జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో దరఖాస్తులు స్వీకరించారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ముందుగా భూపాలపల్లి జిల్లా పోలీస్ కార్యాలయంలో శారీరక పరీక్షలు నిర్వహించగా, అనంతరం సింగరేణి హైస్కూల్‌లో రాత పరీక్షలు నిర్వహించారు. రాత పరీక్ష కేంద్రాన్ని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ పరిశీలించారు. పరీక్షా కేంద్రంలో ఏర్పాట్లను తనిఖీ చేసి, పరీక్షలు రాస్తున్న అభ్యర్థులతో మాట్లాడారు. వారి సన్నద్ధత, పరీక్షకు సంబంధించిన అంశాలను అడిగి తెలుసుకున్నారు. అభ్యర్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాసి తమకు లభించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ నరేష్ కుమార్ మాట్లాడుతూ.. శారీరక, రాత పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులకు 70 రోజుల పాటు ఉచిత డేస్ స్కాలర్ క్లాసులతో పాటు గ్రౌండ్ కోచింగ్ అందించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు ఈ అవకాశాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకుని పోలీస్ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో కష్టపడి చదవడంతో పాటు శారీరకంగా కూడా సిద్ధం కావాలని సూచించారు. జిల్లా నిరుద్యోగ యువతకు అందుబాటులోకి వచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పోలీస్ ఉద్యోగం సాధించే దిశగా కృషి చేయాలని ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఆకాంక్షించారు. కష్టపడి శిక్షణ పొందడం ద్వారా బంగారు భవిష్యత్తుకు పునాదులు వేసుకోవడంతో పాటు తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ నరేష్ కుమార్, భూపాలపల్లి టౌన్ సీఐ శ్రీనివాస్, ఆర్ఐలు రత్నం, సంతోష్ కుమార్, కాశీరాం, ఆర్ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది, పెద్ద సంఖ్యలో నిరుద్యోగ యువత పాల్గొన్నారు.

సేవా స్ఫూర్తితో ఇనగాల వెంకట్రామ్ రెడ్డి జన్మదిన వేడుకలు



పరకాల, సెప్టెంబర్ 06 (నిత్యం నిఘా ప్రతినిధి) : హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి 58వ జన్మదిన వేడుకలు పరకాల నియోజకవర్గంలో ఘనంగా జరిగాయి. గీసుగొండ మండలం పద్మావతి ఫంక్షన్ హాల్‌లో సంగెం, గీసుగొండ మండలాలతో పాటు 15, 16, 17 డివిజన్ల కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధుల సంయుక్త ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. జన్మదినాన్ని పురస్కరించుకుని ఇనగాల ఛారిటబుల్ ట్రస్ట్, రెడ్‌క్రాస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. ఇనగాల వెంకట్రామ్ రెడ్డిపై ఉన్న అభిమానంతో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యువత పెద్ద సంఖ్యలో తరలివచ్చి 320 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికీ ఇనగాల ఛారిటబుల్ ట్రస్ట్ తరఫున ప్రత్యేకంగా రూపొందించిన టీ-షర్టులను అందజేశారు. అనంతరం కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ.. తన జన్మదినం సందర్భంగా భారీగా సేవా కార్యక్రమాలను నిర్వహించిన నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు చూపిస్తున్న ప్రేమాభిమానాలే తన బలమని పేర్కొన్నారు. వారి నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ నియోజకవర్గ అభ్యున్నతికి, పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తానన్నారు. రక్తదానం ద్వారా ఎంతోమంది ప్రాణాలను కాపాడేందుకు ముందుకు వచ్చిన యువతను ఆయన అభినందించారు. సేవా కార్యక్రమాలతో జన్మదిన వేడుకలను నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. వేడుకలకు నియోజకవర్గం నలుమూలల నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ఇనగాల వెంకట్రామ్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వచ్చిన వారందరికీ నిర్వాహకులు ఘనంగా అన్నదానం ఏర్పాటు చేశారు.

తెలంగాణలో నిరంకుశ పాలన కొనసాగుతోంది

- బీజేపీ మండల అధ్యక్షుడు మనెయ్య



షాబాద్, సెప్టెంబర్ 6, (నిత్యం నిఘా) : తెలంగాణలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టుకొని నిరంకుశ పాలన కొనసాగిస్తోందని బీజేపీ మండల అధ్యక్షుడు మనెయ్య ఆరోపించారు.భాగ్యలక్ష్మి అమ్మవారి దేవాలయానికి ర్యాలీగా వెళ్తున్న బీజేపీ, బీజేవైఎం కార్యకర్తలను పోలీసులు అడ్డుకోవడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. హిందూ వ్యతిరేక ధోరణిని వీడి సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు.హిందువులు పండుగలు నిర్వహించుకునేందుకు అనుమతుల పేరుతో ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. నిజాం నిరంకుశ పాలనను ఎలా అంతం చేసి తెలంగాణకు విమోచనం కల్పించామో, అదే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూడా గద్దె దింపుతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కూతురు మహేందర్, గూడెం రమేష్, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు లింగాల మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

జపాన్ సంయుక్త పరిశోధన కార్యక్రమానికి ఎంపికైన పినపాక కు చెందిన సిరి చందన



పినపాక, సెప్టెంబర్ 6, (నిత్యం నిఘా) :
విజయవాడ ఎంబెడెడ్ సిస్టమ్స్‌లో ఏంటెక్ అభ్యసిస్తున్న పినపాక మండల కేంద్రానికి చెందిన సిరి చందన ప్రతిభతో అంతర్జాతీయ స్థాయిలో అరుదైన అవకాశాన్ని దక్కించుకుంది. జపాన్‌తో కలిసి నిర్వహిస్తున్న జాయింట్ రీసెర్చ్ ప్రోగ్రామ్‌కు పరిశోధకురాలిగా ఎంపికైంది. ఈ పరిశోధన కార్యక్రమంలో భాగంగా ఆమెకు సుమారు రూ.1.40 లక్షల స్టైపెండ్ లభించనుంది.ఈ అవకాశాన్ని సాధించడంలో కేఎల్ యూనివర్సిటీ, విజయవాడకు చెందిన గైడ్ డా. వెంకట రత్నం అందించిన నిరంతర సహకారం, మార్గదర్శకత్వం కీలకంగా నిలిచాయి. ఆమె కష్టపడి పనిచేసే స్వభావం, పట్టుదల, ఎన్ని సవాళ్లు ఎదురైనా వెనుకడుగు వేయని నైజం ఈ విజయానికి కారణమయ్యాయని ఆమె తల్లిదండ్రులు ఊటుకూరి వెంకటేశ్వరరావు, రాధా తెలిపారు.జపాన్‌తో చేపట్టనున్న సంయుక్త పరిశోధన కార్యక్రమంలో ఆమె ప్రతిభను చాటుకోవాలని, పరిశోధన విజయవంతంగా సాగి భవిష్యత్తులో మరిన్ని ఉన్నత అవకాశాలు అందుకోవాలని కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజలు ఆకాంక్షించారు.

వివేకానంద పాదుపు సంఘం చేయూత

మృతుడు సతీష్ కుటుంబానికి రూ.1.20 లక్షల ఆర్థిక సాయం అందచేత



షాబాద్, సెప్టెంబర్ 06, (నిత్యం నిఘా) : ఇటీవల షాబాద్‌లో మృతి చెందిన మలగల్ల సతీష్ కుటుంబానికి షాబాద్ వివేకానంద పొదుపు సంఘం అండగా నిలిచింది. సతీష్ సంఘ సభ్యుడిగా ఉండటంతో ఆయనకు వర్తించే సంఘ బీమా సొమ్ము రూ.1,20,000లను కుటుంబ సభ్యులకు అందజేశారు.సభ్యుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ, కష్టకాలంలో వారి కుటుంబాలకు అండగా నిలవడమే సంఘం లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. భవిష్యత్తులోనూ సభ్యులకు అవసరమైన సమయంలో తమ వంతు సహకారం అందిస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు దర్పల్లి రవీందర్ గౌడ్, పాలకమండలి సభ్యులు ఎగురి మల్లికార్జున్, కమ్మరి రజనీకాంత్, గంధం గౌరీశ్వర్, తమ్మలి గౌతమ్, జగదీష్, రవీందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

Nityam Nigha 07.09.26_Layout 1 07-09-2026 02:00 AM Page 8

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

వెంకటాపూర్ గ్రామపంచాయతీ వద్ద బిఆర్ఎస్ పార్టీ నిరసన



సంగారెడ్డి, సెప్టెంబర్ 6, (నిత్యం నిఘా) : సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం వెంకటాపూర్ గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రివర్యులు కేటీఆర్ గారి ఆదేశాల మేరకు వెంకటాపూర్ గ్రామంలో గ్రామ పంచాయతీ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది అదే రకంగా గ్రామంలో ప్రతి డోర్ టు డోర్ తిరుగుతూ రేవంత్ రెడ్డి గారు ఇచ్చినటువంటి 420 హామీలు వాటిలో ఇప్పటివరకు అమలు చేయనటువంటి పెండింగ్ లో ఉన్న హామీలను మన గ్రామానికి రావలసినటువంటి బాకీ ఉన్న హామీలను బాకీ కార్డులను ప్రతి డోర్ టు డోర్ పంపిణీ చేయడం జరిగింది అనంతరం గ్రామపంచాయతీ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ యొక్క కార్యక్రమంలో మాజీ జిల్లా డైరెక్టర్ నగేష్ కురుమ మాట్లాడుతూ వన్ టైం రేవంత్ రెడ్డి గారు మీకున్న రెండు సంవత్సరాల కాల పరిధిలో మీరు ఇచ్చినటువంటి 420 హామీలను అమలు చేయాలని ఎందుకంటే మీరు ఏది చేసిన వన్ టైం మాత్రమే చేస్తారు వన్ టైం జెడ్పిటిసి వన్ టైం ఎమ్మెల్సీ వన్ టైం ఎమ్మెల్యే వన్ టైం ఎంపీ వన్ టైం ముఖ్యమంత్రి కావున ఇక ముందు ఏ పదవి కూడా మీరు చేయలేరు కాబట్టి మీకున్న ఈ రెండు సంవత్సరాల కాల పరిధిలో మీరు ఇచ్చినటువంటి 420 హామీలను వెంటనే నెరవేర్చాలని తెలియజేయడం జరిగింది ఈ యొక్క కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు మండల యువత మాజీ అధ్యక్షులు నరేష్ గౌడ్, బీసీ సెల్ మండల మాజీ ఉపాధ్యక్షులు సిహెచ్ బాబుజి, గ్రామపంచాయతీ మెంబర్లు దండే నవీన్, మల్లగారి యోహాన్, మన్నె మధు, గ్రామ మాజీ పార్టీ అధ్యక్షులు కొత్త గొల్ల మల్లేశం, మాజీ ఉపసర్పంచ్ సోలాపూర్ శంకర్, గ్రామ పార్టీ నాయకులు దుర్గం పోయిని పెద్ద పోచయ్య, కుదైగారి సలీం, కవిలే యాదగిరి, బరురి మాణిక్యం, నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు

సర్ (SIR) నోటీసుకు స్పందించి బిఎల్ఓకు తగిన పత్రాలు అందజేసిన సంగారెడ్డి ఎమ్మెల్యే కాంటెస్టెంట్ అభ్యర్థి పులిమామిడి రాజు



సంగారెడ్డి, సెప్టెంబర్ 6, (నిత్యం నిఘా) : సదాశివపేట: SIR నోటీసుకు స్పందించి సంబంధిత పత్రాలను బిఎల్ఓకు అందజేసి తన ఓటు వివరాలను పక్కాగా చేసుకున్న సంగారెడ్డి ఎమ్మెల్యే కాంటెస్టెడ్ అభ్యర్థి పులిమామిడి రాజు.సదాశివపేట పట్టణంలోని గురునగర్ కాలనీలో 10వ వార్డుకు చెందిన అంగన్వాడి టీచర్ బిఎల్ఓ శ్రీరాముల జయశ్రీ తనకు అందిన సార్ నోటీసుకు సంబంధించిన అవసరమైన పత్రాలను పులిమామిడి రాజు సమర్పించారు.ఈ సందర్భంగా పులిమామిడి రాజు మాట్లాడుతూ సార్ నోటీసులు అందిన ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని, బిఎల్ఓలు సూచించిన సంబంధిత పత్రాలను సమయానికి సమర్పించి తమ ఓటు వివరాలను పక్కాగా చేసుకోవాలని సూచించారు.15 సంవత్సరాల వయస్సు తేడా ఉన్న తల్లిదండ్రులు లేదా కుటుంబ సభ్యులకు సంబంధించిన వివరాల్లో అవసరమైన సందర్భాల్లో 2002 సంవత్సరానికి సంబంధించిన సార్ డేటా పత్రాలతో పాటు ఆధార్ కార్డు, ప్రభుత్వం ఆమోదించిన ఏదైనా గుర్తింపు లేదా సంబంధిత పత్రాన్ని సమర్పించాలని తెలిపారు.అదేవిధంగా 40 సంవత్సరాలు పైబడిన వారు, వయస్సు ఎక్కువగా ఉన్న ఓటర్లు 2002 సంవత్సరానికి సంబంధించిన సార్ డేటా లిస్టును సమర్పించాలని సూచించారు. తండ్రి పేరు, ఇంటిపేరు (సర్‌నేమ్) తదితర వివరాల్లో తప్పులు ఉన్నవారు, అలాగే యువత తమకు సంబంధించిన సరైన పత్రాలను బిఎల్ఓలకు అందజేసి ఓటు వివరాలను సరిచేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఎవరైనా సార్ నోటీసుకు సంబంధించి సందేహాలు ఉంటే, తమ ఎన్యూమరేషన్ ఫామ్ పైభాగంలో ముద్రించిన బిఎల్ఓ పేరు, ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు. అలాగే తమకు అందిన నోటీసులో కూడా బిఎల్ఓ ఫోన్ నంబర్‌తో పాటు పత్రాలు సమర్పించాల్సిన తేదీ, సమయం పొందుపరిచి ఉంటాయని చెప్పారు.కావున ఓటర్లు తమకు అందిన నోటీసును జాగ్రత్తగా పరిశీలించి, అందులో పేర్కొన్న తేదీలోపు అవసరమైన పత్రాలతో బిఎల్ఓ కు సమర్పించాలని, 18సంవత్సరాలు నిండిన కొత్త ఓటర్లు ఫామ్ 6 ద్వారా మీసేవలో అప్లై చేసుకోవాలని పులిమామిడి రాజు సూచించారు.ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును కాపాడుకునేందుకు సార్ ప్రక్రియలో భాగంగా బిఎల్ఓలకు సహకరించాలని, ఎలాంటి సందేహాలు ఉన్నా సంబంధిత బిఎల్ఓలను సంప్రదించి సమస్యలను పరిష్కరించుకోవాలని సంగారెడ్డి నియోజక వర్గ ప్రజలకు పులిమామిడి రాజు విజ్ఞప్తి చేశారు. ఇట్టి కార్యక్రమంలో వారి మిత్రులు బగిలి విష్ణు, నర్సింలు, షకీల్, రాము, సోమ శంకర్ మొదలగు వారు పాల్గొన్నారు.

జహీరాబాద్–బడెంపేట పాదయాత్రకు ఘనంగా సంఘీభావం



సంగారెడ్డి, సెప్టెంబర్ 6, (నిత్యం నిఘా) : జహీరాబాద్ నుండి బడెంపేట వరకు కొనసాగిన పాదయాత్రకు దారి మధ్యలో ష.బ్ర.108 వీరేశ్వర శివాచార్య మహాస్వామి ధనసిరి ఆధ్వర్యంలో ఘనంగా సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా జహీరాబాద్ యువజన నాయకులు శ్రీ సురేష్ షెట్కర్ ఆధ్వర్యంలో పాదయాత్రలో పాల్గొన్న వారికి పండ్లు, పాలు, మంచినీరు పంపిణీ చేశారు. పాదయాత్రికులకు అవసరమైన సేవలు అందిస్తూ కార్యక్రమానికి తమ మద్దతును తెలిపారు.ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా వీరశైవ లింగాయత్ సమాజం సలహాదారులు అన్నిశెట్టి జయప్రకాశ్, యువజన అధ్యక్షులు బుగ్గనగారి మల్లికార్జున్, వీరేశం, చంద్రకాంత్, నీలకంఠప్ప, గుణాకర్, మల్లేశం, రోహిత్, శివరాజ్, అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.పాదయాత్రికులకు సేవ చేయడం ద్వారా సమాజ ఐక్యత, భక్తి భావం, పరస్పర సహకారాన్ని చాటిచెప్పారని నిర్వాహకులు తెలిపారు.

ఊకే శిరీష కు న్యాయం జరిగేంత వరకు ఈ పోరాటం ఆగదు అంటున్న ఆదివాసి హక్కుల పోరాట సమితి



ఇల్లందు, సెప్టెంబర్ 6, (నిత్యం నిఘా) : ఆదివాసి హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ మరియు ఆదివాసి 9 తెగల ఐక్య కార్యచరణ సమితి ఆధ్వర్యంలో మహబూబాద్ జిల్లా, పాకాల కొత్తగూడా మండల పరిధిలోని మడగుడం గ్రామం నుండి స్వర్గీయ కుమారి ఊకేశిరీష(నర్సు) స్వగ్రామం సొంటెగుడం, ములకలపల్లి మండలం, భద్రాద్రి జిల్లా వరకు పాదయాత్రకు పూజా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. తుక్కుగూడ ప్రైమ్ కేర్ హాస్పిటల్ లో అత్యంత కిరాతకంగా క్రూరంగా హత్య అత్యాచారం గావించబడ్డ మృతురాలు కుటుంబానికి ప్రభుత్వం నుండి పూర్తిస్థాయిలో న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ మరికొద్ది సమయంలో ఈ రోజు పాదయాత్ర కొనసాగుతుంది. అని ఆదివాసి సంఘాలు తెలియజేశారు.

గోదావరి పుష్కరాల భక్తుల కోసం డార్మెంటరీ నిర్మాణం

- **గోదావరి పుష్కరాల భక్తుల కోసం డార్మెంటరీ నిర్మాణం**
- **భద్రాచలంలో రూ.1.50 కోట్ల వ్యయంతో డార్మెంటరీ నిర్మాణానికి భూమిపూజ.**
- **భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా నిర్మాణాలు సకాలంలో పూర్తి చేయాలి: కలెక్టర్ అంకిత్.**





భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 6, (నిత్యం నిఘా) : వచ్చే ఏడాది 2027 జూన్–జూలై నెలల్లో నిర్వహించనున్న గోదావరి పుష్కరాలకు భద్రాచలం వచ్చే భక్తుల సౌకర్యార్థం డార్మెంటరీ హాల్ నిర్మిస్తున్నట్లు భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు తెలిపారు.గోదావరి పుష్కరాల సందర్భంగా భద్రాద్రి జిల్లాలోని దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్ర స్వామివారి ఆలయానికి దేశ నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉందన్నారు. భక్తులకు వసతి సౌకర్యం కల్పించేందుకు దేవాదాయ–ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో భద్రాచలంలోని అమ్మ సత్రం ప్రాంతంలో రూ.1.50 కోట్ల వ్యయంతో డార్మెంటరీ జీ+1 భవనం నిర్మించనున్నట్లు పేర్కొన్నారు.ఈ నిర్మాణానికి ఆదివారం భూమిపూజ కార్యక్రమం నిర్వహించగా ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోదావరి పరివాహక ప్రాంతాల్లో నిర్వహించే గోదావరి పుష్కరాలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరవుతారని, ముఖ్యంగా భద్రాచలం పుణ్యక్షేత్రానికి దేశవ్యాప్తంగా అత్యధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు.భక్తులకు కనీస వసతులు కల్పించాలనే ఉద్దేశంతో వారి వసతి కోసం దేవాదాయ శాఖ తరపున డార్మెంటరీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. పుష్కరాల పనులపై పది రోజులకు ఒకసారి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తామని, అధికారులు దీనిని గమనించి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు.ఘాట్ నిర్మాణ పనులను ఇరిగేషన్ శాఖ అధికారులు, తాగునీటి సరఫరా పనులను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, రహదారి పనులను ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు చేపట్టి ఎప్పటికప్పుడు పనులను పర్యవేక్షించాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.పుష్కర పనులు వేగంగా పూర్తి చేయాలిఅనంతరం భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ 12 సంవత్సరాలకు ఒకసారి వచ్చే గోదావరి పుష్కరాలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తోందన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు.గోదావరి పరివాహక ప్రాంతాల్లో చేపట్టిన ఘాట్ నిర్మాణాలతో పాటు డార్మెంటరీ నిర్మాణ పనులను కూడా సకాలంలో, త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఏడు జిల్లాల్లో గోదావరి పుష్కర పనులు కొనసాగుతున్నాయని, ముఖ్యంగా భద్రాచలంలో జరుగుతున్న పనులను నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ వేగంగా, నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో భద్రాచలం ఈఓ దామోదర్, సర్పంచ్ పూనం కృష్ణ, ఉపసర్పంచ్ రత్నం కవిత, వార్డు సభ్యులు రమణ, కారం దుర్గారావు, వాణి తదితరులు పాల్గొన్నారు.

గిరిజన దర్బార్, ప్రజావాణి కార్యక్రమానికి అధికారులు సకాలంలో హాజరు కావాలి



భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 6, (నిత్యం నిఘా) : సోమవారం భద్రాచలం ఐటీడీఏ, సబ్ కలెక్టర్ కార్యాలయాల్లో నిర్వహించనున్న గిరిజన దర్బార్, ప్రజావాణి కార్యక్రమాలకు అన్ని శాఖల ఐటీడీఏ యూనిట్ అధికారులు, డివిజన్ అధికారులు సకాలంలో హాజరు కావాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్, సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.గిరిజనులు, ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖితపూర్వకంగా ఫిర్యాదులను అందజేయాలని వారు సూచించారు. సంబంధిత యూనిట్ అధికారులు, డివిజన్ అధికారులు ఉదయం 10.30 గంటలకు భద్రాచలం ఐటీడీఏ, సబ్ కలెక్టర్ కార్యాలయాల్లోని సమావేశ మందిరాల్లో తప్పనిసరిగా హాజరుకావాలని పేర్కొన్నారు.

Printed, Published and Owned by Bura Nagesh Goud, on behalf of Amulya Publications & Printers Graphics, Editor - Bura Nagesh Goud, is responsible for news selection under PRB act prgi.gov.in RNI. TGTEL/25/A1665, # 5-11-1014/A, Naim Nagar, Hanamkonda, Warangal, Telangana, India - 506009, Cell : 9441974025, 9440170543 Email:nityamnigha.acs@gmail.com